# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 20-9-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 47 పేజీలు 8 వెల: రూ.1/-


## బద్రీనాథుని దర్శించుకున్న ఆర్మీ చీఫ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ ఇవాళ బద్రీనాథ్ వెళ్లారు. ఆయన సతీసమేతంగా బద్రీ నారాయణుడి దర్శనం చేసుకున్నారు. 15 నిమిషాల పాటు దంపతులిద్దరూ పూజలు చేశారు. భార్య మధులిక రావత్‌తో కలిసి బిపిన్ బుధవారం కేదార్‌నాథ్ కూడా వెళ్లారు. ఇద్దరూ కేదారీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఛార్‌దామ్‌లో ముఖ్యమైన కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లను ఆర్మీ చీఫ్ దర్శించడం విశేషం. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రధాని మోదీ కూడా ఈ దివ్యక్షేత్రాలను దర్శించారు. ప్రధాని ఓ రోజు కేదార్‌నాథ్ గుహలో గడిపిన విషయం తెలిసిందే.

# ఆర్టీసీ కంటే మెట్రో ఛార్జీలు తక్కువ

**- పాతబస్తీకి మెట్రో సర్వీసు నడుపుతాం**

**- అసెంబ్లీలో మంత్రి కేటీఆర్**



హైదరాబాద్, సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ) : మెట్రో ట్రైన్ రాయితీ ఒప్పందంలో ఎటువంటి మార్పులేదని రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. అసెంబ్లీలో మెట్రో అలైన్‌మెంట్, ఛార్జీలపై కాంగ్రెస్ పక్షనేత మల్లు భట్టి విక్రమార్క అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. హైదరాబాద్ మెట్రో విజయవంతంగా నడుస్తోందని కేటీఆర్ తెలిపారు. ప్రతిరోజూ 3లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలో అన్ని మెట్రోలతో హైదరాబాద్ మెట్రోను పోల్చొద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్సు ఛార్జీల కంటే మెట్రో ఛార్జీలు తక్కువని చెప్పారు. పాతబస్తీకి మెట్రో సర్వీసు నడుపుతామని తేల్చిచెప్పారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత సుల్తాన్ బజార్, ఓల్డ్ సిటీ, అసెంబ్లీ మార్గాలను పునఃపరిశీలన చేస్తామని చెప్పిన విషయం వాస్తవమన్నారు. వీటి పరిశీలన బాధ్యతను సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు అప్పగించిన విషయాన్ని చెప్పారు. అనంతరం సుల్తాన్ బజార్ వ్యాపారులకు ఇబ్బంది రాకుండా మెట్రో నిర్మాణ పనులు చేపట్టామన్నారు. రానున్న రోజుల్లో మెట్రోను మరింత విస్తరిస్తామన్నారు. గత ప్రభుత్వం గన్‌పార్కును పడగొడుతూ.. హైదరాబాద్ మెట్రో అలైన్‌మెంట్‌కు అనుమతినిచ్చిందని మంత్రి వెల్లడించారు. దేశంలోని మెట్రోలన్నింటికంటే హైదరాబాద్ మెట్రో శరవేగంగా పూర్తయిందని చెప్పారు. అక్టోబర్ నాటికి రెండు కిలోమీటర్లు, డిసెంబర్‌నాటికి 10 కిలోమీటర్లు పూర్తి చేసుకొని మొత్తం 66 కిలోమీటర్ల మెట్రో మార్గం అందుబాటులోకి వస్తుందన్నారు. మెట్రో అంచనా వ్యయం రూ.14,132 కోట్లుతో పాటు భూ సేకరణ కింద రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.3 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మెట్రోకు మొత్తం 80 పురస్కారాలు వచ్చాయని తెలిపారు. హైదరాబాద్ మెట్రోను..అతిపెద్ద పీపీ ప్రాజెక్టుగా కేటీఆర్ అభివర్ణించారు.

# సింగరేణి కార్మికులకు 28శాతం బోనస్



**- అసెంబ్లీలో ప్రకటించిన సీఎం కేసీఆర్**

**- పోలీసులకు వీక్లీఆఫ్‌పై త్వరలోనే నిర్ణయం**

**- కాళేశ్వరం నీళ్లు శ్రీరాంసాగర్‌ను ముద్దాడేలా చేశాం**

**- గోదావరి ప్రాణహిత కలిసిన చోటే మనకు నీళ్లున్నాయి**

**- సింగూరు, నిజాంసాగర్, శ్రీరాంసాగర్‌లు నింపుకుంటే మనకు ఇబ్బందే ఉండదు**

**- అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం కేసీఆర్ వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ) : సింగరేణి కార్మికులకు లాభాల్లో 28శాతం బోనస్ అందజేయనున్నట్లు తెలంగాణ సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారు. గురువారం అసెంబ్లీలో మాట్లాడిన ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. ఒక్కో కార్మికుడికి రూ.1, 00,899 బోనస్ చెల్లిస్తామన్నారు. దీంతో ఒక్కో కార్మికుడు గత ఏడాది కంటే రూ.40,530 అదనంగా పొందనున్నారని తెలిపారు. సింగరేణి సంస్థ తెలంగాణ అభివృద్ధిలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తుందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం, కార్మికుల సంక్షేమానికి తీసుకున్న చర్యల ఫలితంగా సింగరేణి సంస్థాగతంగా బలోపేతం అయిందని కేసీఆర్ పేర్కొన్నారు. యాజమాన్యం, కార్మికులు అనే తారతమ్యం లేకుండా సింగరేణిలో పనిచేస్తున్న ప్రతీఒక్కరు ఎంతో బాధ్యతగా పనిచేయడం వల్ల సంస్థలో సానుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు. సంస్థ పనితీరు గణనీయంగా మెరుగుపడి రికార్డుస్థాయి ఉత్పత్తి చేయడానికి ఈ పరిణామం దోహదపడిందన్నారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సంస్థలో 50.47 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయగలిగామని, గత ఐదేళ్లలో ప్రతీ ఏడాది బొగ్గు ఉత్పత్తి పెరుగుతూ వస్తుందని కేసీఆర్ అన్నారు. 2018-19 సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయిలో 64.41 మిలియన్ టన్నులకు చేరుకున్నదని తెలిపారు. దసరా పండుగ పురస్కరించుకొని సింగరేణికి అందిస్తున్న కానుక ఇదని, సింగరేణి కార్మికులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుంటూ అంకిత భావంతో పనిచేయాలని, మరిన్ని లాభాలు, విజయాలు సాధించి పెట్టాలని సీఎం కేసీఆర్ కోరారు.

### పోలీసుల వీక్లీ ఆఫ్‌లపై త్వరలోనే నిర్ణయం..

మరోవైపు అసెంబ్లీలో పలువురు సభ్యుల అడిగిన ప్రశ్నలపై కేసీఆర్ మాట్లాడారు.. హోంగార్డులకు మనం ఇస్తున్న వేతనం దేశంలో ఎక్కడా ఇవ్వడం లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. దేశంలో ఏ నగరానికి లేని భవిష్యత్తు హైదరాబాద్ నగరానికి ఉందన్నారు. హైదరాబాద్‌కు ఆరు వైపుల హెలిప్యాడ్స్ కూడిన సెంటర్స్ అవసరం ఉందని, తెలంగాణ పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని సీఎం కితాబిచ్చారు. మనం సుఖంగా నిద్రపోతున్నామంటే అందుకు పోలీసులే కారణమన్నారు. అదేవిధంగా పోలీసులకు వారాంతపు సెలవులు అంతసులువు కాదనీ, అయినప్పటికీ ఈ విషయమై డీజపీ, ఇతర ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామన్నామని తెలిపారు. డిసెంబర్, జనవరికల్లా కమాండ్ కంట్రోల్ పూర్తి కావొస్తోందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా హోం గార్డులకు మంచి వేతనం అందిస స్తున్నామన్నారు.

### కాళేశ్వరం నీరు శ్రీరాంసాగర్‌ను ముద్దాడేలా చేశాం..

అనంతరం తాగునీటి ప్రాజెక్టులపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సీఎం కేసీఆర్ మాట్లాడారు.. ఎస్ఆర్ఎస్పీ వరద కాల్వనే రిజర్వాయర్‌గా మార్చాలని ఆలోచించామని, ఆలోచనను అమలులోకి తీసుకువచ్చి విజయవంతగా పూర్తి చేసి శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టును కాళేశ్వరం నీళ్లు ముద్దాడేలా చేశామని కేసీఆర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సీఎం సమాధానం ఇస్తూ... గోదావరి, ప్రాణహిత కలిసిన చోటనే మనకు నీళ్లు ఉన్నాయని, సింగూరు, నిజాంసాగర్, శ్రీరాంసాగర్ నింపుకుంటే మనకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. ఎస్ఆర్ఎస్పీ వరద కాలువ మ్యాన్‌మేడ్ రివర్‌లాంటిదని, శ్రీరాం సాగర్ ప్రాజెక్టు పాత ఆయకట్టు 7లక్షల ఎకరాలుకు సాగునీరు స్థిరీకరణ జరిగిపోయిందని తెలిపారు. ఎస్ఆర్ఎస్పీ దగ్గర టూరిజం ప్రాజెక్టు రావాల్సి ఉందని, కాళేశ్వరం ప్రాజెక్టుకు నవంబర్ నెలలో కూడా 40 టీఎంసీల నీళ్లొస్తున్నాయని అన్నారు. దేవుని దయవలన వర్షాలు కురుస్తున్నాయని అన్నారు. సీపీఐ నేత వెంకట్‌రెడ్డి స్వగ్రామానికి కూడా నీళ్లొచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ నేత వెంకట్‌రెడ్డి మెచ్చుకున్నారని అన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని సీఎం ప్రకటించారు. అప్పులు తెచ్చి సద్వినియోగం చేసుకున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో 44 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తామని వెల్లడించారు.

## రైతుకు నష్టంచేసే..
# కంపెనీలపై క్రిమినల్ చర్యలు

**- నకిలీ విత్తనాలు సరఫరా చేస్తే జైలుకు పంపిస్తాం**

**- తెలంగాణ సీడ్‌పాలసీని కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంటుంది**

**- 150ఎకరాల్లో సీడ్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నాం**

**- విత్తన ప్రాసెసింగ్ సమార్థ్యాన్ని రెండింతలు పెంచాం**

**- ప్రపంచంలో 18దేశాలకు తెలంగాణ విత్తనాలు ఎగుమతి చేస్తున్నాం**

**- అసెంబ్లీలో వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ) : రైతులకు ఎలాంటి నష్టం జరిగినా ప్రభుత్వ పరంగా చూస్తూ ఊరుకోబోమని, కఠిన చట్టాలు అమల్లోకి తెస్తున్నామని, రైతులకు నష్టంచేసే కంపెనీలపైనా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామని తెలిపారు. విత్తనోత్పత్తికి తెలంగాణా చాలా అనుకూలమని, రైతులకు విత్తనాలు సబ్సిడీ మీద అందిస్తున్న ఘటన తెలంగాణ ప్రభుత్వానికే దక్కుందని తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నామని, నాసిరకం విత్తనాలు సరఫరా చేసే వారిని జైలుకు పంపేలా కొత్త చట్టాలను తీసుకొచ్చామన్నారు. రైతులకు నష్టం చేసే కంపెనీలపై క్రిమినల్ చర్యలు తీసుకుంటున్నామని, తెలంగాణ సీడ్ పాలసీని కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంటుందని మంత్రి పేర్కొన్నారు. విత్తన ప్రాసెసింగ్ సమార్థ్యాన్ని రెండింతలు పెంచుకున్నామని తెలిపారు. మూడు లక్షల నలభై ఎనిమిదివేల సమర్థ్యాన్ని ఆరు లక్షల నలభైవేల క్వింటాళ్లకు విత్తనాన్ని ప్రాసెసింగ్ కెపాసిటీని పెంచుకున్నామన్నారు. రాష్ట్రంలో 31 నియోజకవర్గాల్లో విత్తనశుద్ధి యంత్రాలను నెలకొల్పామని, విత్తన నిలువ సామర్థ్యాన్ని ఐదు లక్షల ముప్పై రెండువేల క్వింటాళ్లకు పెంచుకున్నామని పేర్కొన్నారు. దాన్ని నిలువ ఉంచడానికి ఆధునిక గోడౌన్లను ఏర్పాటు చేసుకున్నామని, సరిహద్దు జిల్లాల్లో విజిలెన్స్‌ను పటిష్టం చేశామని, వ్యవసాయానికి పరంగా ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రపంచంలోని 18దేశాలకు తెలంగాణ నుంచి విత్తనాలకు ఎగుమతి చేస్తున్నామని తెలిపారు. 150 ఎకరాల్లో సీడ్ పార్క్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని, సీడ్ పార్క్‌లో తమకు స్థలాలు కావాలని ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు కోరాయని మంత్రి వివరించారు. స్థలాల కోసం అన్వేషణ చేపట్టామని, అన్నీ అనుకుంటే త్వరలో సీడ్ పార్క్ ను ఏర్పాటు చేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన ఆంధ్రా, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి నకిలీ విత్తనాలు రవాణా అవుతున్నాయని ఫిర్యాదులు ఉన్నాయని, ఆ ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు, ఎరువుల రవాణాను పూర్తిగా నిలిపివేసేందుకు టాస్క్ ఫోర్స్ ను ఏర్పాటు చేశామని అన్నారు.

# 23 నుంచి బతుకమ్మ చీరల పంపిణి

**- మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ) : సెప్టెంబరు 23 నుంచి రాష్ట్రంలో బతుకమ్మ చీరల పంపిణీ చేస్తామని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చెప్పారు. సీడీఎంఏ కార్యాలయంలో ప్రభుత్వం రూపొందించిన వివిధ డిజైన్ల బతుకమ్మచీరలను గురువారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ ఏడాది 10 రకాల డిజైన్లను 10 రకాల రంగులతో సిరిసిల్లలోని నేత కార్మికులతో తయారు చేయించిందని, మొత్తం కోటి చీరలు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. అర్హత గల మహిళలు చీరలు ధరించటానికి ఎటువంటి ఇబ్బంది పడకుండా పెద్దవయస్సు మహిళల కోసం 9మీటర్లు చీరలు కూడా సిద్ధం చేశామని కేటీఆర్ వివరించారు. ఇవి సుమారు 10లక్షల చీరలు సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగతా 6మీటర్ల చీరలు 90లక్షలు వివిధ జిల్లాలకు పంపిస్తున్నామని ఆయన వివరించారు. 2017 నుంచి ఇప్పటి వరకు బతుకమ్మ చీరలమీద ప్రభుత్వం రూ.715 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, దీనివలన నేత కార్మికుల జీవన ప్రమాణాలు బాగుపడ్డాయని మంత్రి చెప్పారు. వచ్చేఏడాదిలోగా బతుకమ్మ చీరలు బ్రాండ్ పేరుతో బహిరంగ మార్కెట్ లో కూడా ప్రవేశ పెట్టి నేత కార్మికులకు మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేటీఆర్ తెలిపారు.

# తెలుగు రాష్ట్రాలకు జలకళ..

**- ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు**

**- మళ్లీ కృష్ణానదికి వరద ప్రవాహం**

**- నిండుకుండల్లా శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు**

హైదరాబాద్, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ) : తెలుగు రాష్ట్రాల్లో ప్రాజెక్టులకు నీటి ప్రవాహం పోటెత్తుతోంది. ఎగువున కురుస్తున్న వర్షాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీనికితోడు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో నదుల్లోకి, ప్రాజెక్టుల్లోకి నీరు చేరుతుంది. భద్రాచలం దగ్గర నీటిమట్టం నిలకడగా ఉంది. ప్రస్తుతం నీటి ప్రవాహం 23.9 అడుగులకు చేరుకుంది. ఎగువన వర్షాలు కురుస్తున్నందున రెండు నుంచి మూడు అడుగుల మేర నీటిమట్టం పెరిగే అవకాశమున్నట్టు సీడబ్ల్యూసీ అధికారులు పేర్కొన్నారు.

మరోవైపు ఛత్తీస్‌గఢ్ , మహారాష్ట్రలో వర్షాలు కురుస్తుండడంతో తాలిపేరు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో 79వేల 343 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు మళ్లీ వరద పెరిగింది. జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లోలు భారీగా పెరిగాయి. నాగార్జునసాగర్ నాలుగు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. తుంగభద్రకు వరద స్వల్పంగా పెరిగింది.

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకూ వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ఇన్‌ఫ్లో లక్షా 24వేల క్యూసెక్కులుండగా... అవుట్‌ఫ్లో లక్షా 18వేల 34 క్యూసెక్కులు. తొమ్మిదిగేట్ల ద్వారా నీటిని బయటకు వదులుతున్నారు. అదేవిధంగా తుంగభద్రకు వరద స్థిరంగా కొనసాగుతోంది

. కర్నాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు స్థిరంగా వరద వస్తోంది. ప్రస్తుతం తుంగభద్రకు 21వేల 279 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 21వేల 63 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,633 అడుగుల నీటిని నిల్వ చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు మళ్లీ వరద భారీగా పెరిగింది. ప్రస్తుతం లక్షా 26వేల 657 క్యూసెక్కుల వరద వస్తోంది. జూరాల నుంచి 70వేల 113 క్యూసెక్కులు, పవర్‌హౌజ్ నుంచి మరో 43వేల 107 క్యూసెక్కులు, సుంకేశుల నుంచి 13వేల 437 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు నుంచి 78వేల 540 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయడంతో నాగార్జునసాగర్‌కు వరద వస్తోంది. శ్రీశైలం నుంచి సాగర్‌కు 70వేల 456 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ పూర్తి స్థాయికి నీరు చేరడంతో ఎగువ నుంచి వస్తున్న నీటిని ఎనిమిది క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు.

## చరిత్రలో నేటినిజం



శ్రీ/౦॥ నాగేశ్వరరావు పుత్రుండగు
'నాగేశ్వరుడు కీర్తి నౌని' నటనాలయమై
దాగిన సామర్థ్యమ్మును
వేగిరముగ ప్రజల కోసం నేత్రై నిలచెను!!

*( సెప్టెంబర్ 20 అక్కినేని నాగేశ్వరరావు జయంతి)*



-రాధశ్రీ

సెల్: 9494481210

# రోడ్డు ప్రమాద బాధితులకు మంత్రి సత్యవతి రాథోడ్ సంతాపం

**మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశం**

హైదరాబాద్, సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): జనగామ జిల్లా దేవరుప్పల మండల కేంద్రం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన మహబూబాబాద్ కి చెందిన పెనుగొండ గణేశ్(60),పెనుగొండ సుకన్య(38), ఎండి,నజీర్,(డ్రైవర్), శ్రీలత మృతి పట్ల గిరిజన సంక్షేమ, మహిళా- శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న మంజూష ఆరోగ్య పరిస్థితి గురించి అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్య సాయం అందించాలని ఆదేశించారు.మృతుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్ నాయక్ తో మంత్రి సత్యవతి రాథోడ్ గారు స్వయంగా మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యులు, చికిత్స పొందుతున్న మంజూషకు కావాల్సిన సాయాన్ని ఎమ్మెల్యే శంకర్ నాయక్ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

# పరిగిలో విజిలెన్స్ తనిఖీలు

## టన్ను రేషన్ బియ్యం స్వాధీనం

వికారాబాద్, సెప్టెంబర్20(ఆర్ఎన్ఎ): పరిగిలో గురువారం పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ క్రమంలో కోళ్ల దాణా దుకాణంలో నిల్వ చేసిన వెయ్యి క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యంతో కోళ్ల దాణా తయారు చేస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. కోడిపిల్లల పరిపక్వత కోసం ఎముకల పౌడర్ సైతం కలుపుతున్నట్లు తమ పరిశీలనలో వెల్లడైందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో పోలీసులు నలుగురిని అరెస్టు చేసినట్టు వారు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

# ఇది కల్తీ యగం..!

నేటినిజం

శుక్రవారం 20-9-2019

ఇది కలియుగమన్న నిజం చాలా మందికి తెలియకపోవచ్చును. కానీ కల్తీ యుగమన్నది మాత్రం జనమెరిగిన సత్యం. మనం చాలా జాగ్రత్తగా సర్వవిధ సౌకర్యాలను నిత్యం భోంచేస్తుండటం స్వేచ్ఛావిపణి-మార్కెట్ ఎకానమనీ సృష్టిస్తున్న మాయాజాలం. నగరాలలో పట్టణాలలో మాత్రమే కాదు పల్లెలలో సైతం పుట్టలు పగిలిన 'తక్షణాహార కేంద్రాలు' ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు-వివిధ రుచుల సౌకర్య నిలయాలు. సంకరం చేయడం చట్టబద్ధమైపోయింది. మళ్లీ కల్తీకి వ్యతిరేకంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ చర్యలకు వ్యతిరేకంగా కల్తీ వ్యాపారులు ఉద్యమాలు చేస్తారు. మార్కెట్లను మూసి వేస్తారు. మంత్రులు ఇతరేతర ప్రభుత్వ ప్రతినిధులు కూడా హడావిడిగా పరిగెత్తుకొని వెళ్లి వ్యాపారులను బుజ్జగిస్తారు. హైదరాబాద్‌లో నిన్న, మొన్న ఈ ప్రహసనమంతా పునరావృతంతం అయింది. దాదాపు తొంభై మంది వ్యాపారుల లైసెన్స్‌లను రద్దు చేయగానే వారికి మద్దతుగా పట్టబడని వ్యాపారులు సమ్మె చేసారు. అందువల్ల ప్రభుత్వ ప్రతినిధులు బుజ్జగించడం అనివార్యమైంది. పట్టుబడిన వారిని న్యాయస్థానంలో నిలబెట్టి జైలుకు పంపాలి. పట్టుపడని వారు సమ్మె, మూసివేత వంటి చర్యలకు పూనుకొనడాన్ని నిరోధించాలి. ప్రభుత్వం ఈ చట్టం అమలు జరపలేదు. బుజ్జగించింది. దేశమంతటా ఇదే తీరు అక్రమాలు వ్యాపార సంప్రదాయాలుగా మారడమే ప్రపంచీకరణ. మార్కెట్ ఎకానమీ...

ఉదాహరణకు బొగ్గు రసాయనం కార్బైడ్ తో కలుషితమైన పండ్లను అమ్ముతున్న వ్యాపారులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు వివిధ చర్యలను ప్రారంభించడం ముదావహం. దేశవ్యాప్తంగా విష రసాయనాల పూతలతో మెరుగులు దిద్దుకుంటున్న పండ్లు, కూరగాయలు వినియోగదారులను సమ్మోహితులను చేస్తున్నాయి. బంగారపు రంగుల అరటిపండ్లు, పసుపురంగు కమలాలు, ఎర్రటి ఆపిల్‌పండ్లు లాంటివన్నీ పైపైని రంగులు. విషం నిండిన రసాయనాల వన్నెలు.. పండులోపల కూడా రసాయన విషాలతో మార్పులు చేస్తున్నారు. పచ్చి కర్‌బూజా, తరబూజ, కళింగర కాయ, ఎర్రటి గుజ్జుగల పండువలె భ్రమింపజేస్తుంది. కాయలను పండ్లవలె భ్రమింపజేయడం, కూరగాయలను నిగనిగలాడించడం గొప్ప రసాయనిక విద్య. ఇది వ్యాపారులు మాత్రమే కాదు రైతులకు సైతం తెలిసి సంకర విద్య. ఈ విద్య ప్రపంచీకరణ ఫలితంగా అనివార్యం అయిపోయింది. ఆస్ట్రేలియా నుంచి ఆస్ట్రియా నుంచి న్యూజిల్యాండ్ నుంచి నెదర్‌ల్యాండ్స్ నుంచి వస్తున్న పండ్లకు మెరుగులు దిద్దడం సౌకర్య ప్రక్రియ. అందువల్ల ప్రభుత్వాలు చివరికి న్యాయస్థానాలు సైతం ఒక వైపు విష రసాయనాలతో పండ్లను, కూరగాయలను సంకరం చేసి శోభింపజేసే ప్రక్రియకు అనుమతి ఇస్తున్నాయి. మరోవైపు న్యాయస్థానాలు వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నాయి. నగరంలో బొగ్గు రసాయనం వాడి పండ్లను కలుషితం చేసిన దాదాపు తొంభైమంది వ్యాపారుల లైసెన్సులు రద్దుకావడం ఇందుకు ఉదాహరణ. ఇందుకు కారణాలు అనేకం. వివరాలలోకి వెళితే...

ప్రాచీన భారతదేశంలో కూరగాయలు, పండ్లు దేశమంతటా నగరాలలో పల్లెలలో ఉత్పత్తి అయ్యేవి. నగరాల ప్రజలకు కావలసిన కూరలు, పండ్లు అన్నీ నగరాల్లోనే ఉత్పత్తి అయ్యేవి. నగరాల, పట్టణాల నిర్మాణంలో వ్యవసాయ క్షేత్రాలు, పాలల ఉత్పత్తి ప్రాంగణాలు భాగంగా ఉండేవి. పల్లెలు ఆహార ఉత్పత్తుల విషయంలో స్వయం సమృద్ధంగా ఉండేవి. అందువల్ల పండ్లు కూరగాయలను సుదూర ప్రాంతాలనుంచి తరలించుకుని రావలసిన అవసరం ఉండేది కాదు. ఈ వికేంద్రీకృత వ్యవస్థను బ్రిటన్ సామ్రాజ్యవాదులు ధ్వంసం చేసారు. కేంద్రీకరణ మొదలైంది. దూర దూర ప్రాంతాలనుంచి తరలివస్తున్న కూరలను, పండ్లను విష రసాయనాలతో నిలవచేయాల్సిన అవసరం ఏర్పడింది. కల్తీకి ఇదే ప్రధాన కారణంగా నిలిచింది.

# గ్రామాల్లో ప్రణాళికా సందడి

హైదరాబాద్, సెప్టెంబర్ 19:గ్రామప్రణాళికలతో పల్లెల్లో సందడి వారతావరణం కనిపిస్తోంది. ప్రభుత్వం చేపట్టిన 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో గ్రామాల్లో కనీస వసతులు కల్పించి అభివృద్ధికి బాటలు వేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులంతా పల్లెబాట పట్టారు. గ్రామాల్లో పచ్చదనం సంతరించుకునేలా మొక్కల పెంపకం, పల్లెలను అద్దంలా తయారు చేసేందుకు పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసేందుకు మరమ్మతులు చేయడం వంటి పనులను చేపడుతున్నారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో యువకులతో కలిసి పారతో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించే పనిచేపట్టారు. ప్రతి ఒక్కరూ సొంత ఊరికి కొంత మేరకైనా శ్రమదానం చేయాలని పిలుపు నిచ్చారు. కలెక్టర్లు పంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా సందర్శించి, గ్రామ కమిటీల సభ్యులతో ప్రగతి ప్రణాళిక పనుల వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, ఇన్‌చార్జీల పర్యటనల తో గ్రామాల్లో పండుగ వాతావరణంతో సందడి నెలకొన్నది. గ్రామ, మండలస్థాయిల్లో నియమించిన ప్రత్యేక అధికారుల బృందాలు ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల రూపురేఖలు మార్చేందుకు వివిధ శాఖల వారీగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. అలాగే హరితహారంపై స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. వార్డులు, కాలనీల్లో పర్యటించిన ప్రజలకు అవసరమైన పనులకు గ్రామసభల ద్వారా ప్రతిపాదనలు తయారు చేసి నిధులు కేటాయించేలా ముందుకు సాగుతున్నారు. గ్రామానికి చెందిన ధనవంతులు, ఆర్థికంగా స్థితి మంతులు, ఇతర దేశాలు, రాష్ట్రాలు, ప్రాంతాల్లో స్థిరపడిన వారి సహకారంతో గ్రామాభివృద్ధికి తోడ్పాటు నందించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుతో జిల్లాల్లో పలువురు దాతలు ముందుకు వస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 30 రోజుల్లో గ్రామాభివృద్ధికి ప్రత్యేక కోసం వారు తమవంతుగా విరాళాలు ఇస్తున్నారు. గ్రామాలు పచ్చదనాన్ని సంతరించుకునేలా చూడడం, పారిశుధ్యాన్ని మెరుగు పర్చడం, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడంతోపాటు స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు పడుతున్నాయి. గ్రామగ్రామాన వీధులు, వార్డుల్లో గ్రామ ప్రత్యేక అధికారి నేతృత్వంలో గ్రామ కార్యదర్శి, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు, కో ఆప్షన్ సభ్యులు పర్యటించి రోడ్లు, వీధిలైట్లు, పాడుబడిన బావులు, శిథిలమైన ఇళ్లు, బోరు బావులు, మురికి కాల్వలను పరిశీలించి ఎక్కడికక్కడ ఎలాంటి పనులు అవసరమో గుర్తించి అభివృద్ధి ప్రణాళికలో ప్రతిపాదించి బడ్జెట్ కేటాయిస్తారు. గ్రామీణ ప్రజలకు మేలు చేసే లక్ష్యంగా పంచాయతీలను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను అమలుకు బాటలు పడుతుండడంతో ఇక సమస్యల్లేని గ్రామాలుగా రూపాంతరం చెందనున్నాయి. ఇక జిల్లా, మండల పరిషత్, పురపాలక సంఘాల్లో మాదిరిగా గ్రామ పంచాయతీల్లోనూ కొత్తగా ముగ్గురు కో ఆప్షన్ సభ్యులు, స్టాండింగ్ కమిటీలను ఎన్నుకునే పక్రియ మొదలైంది. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత వెల్లివిరిసేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టేందుకు పవర్‌వీక్, హరితహారం కార్యక్రమాల నిర్వహణకు 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించి మండలాల వారీగా ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించారు. గ్రామాల్లో పవర్‌వీక్ పేరిట ఏడురోజుల పాటు పూర్తిగా విద్యుత్ సంబంధమైన సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుంది. గ్రామాల్లో వీధిలైట్ల కోసం ఎంత కరెంట్ వాడుతున్నారో కచ్చితమైన నిర్ధారణకు రావడం, మీటర్లు పెట్టడం, వీధిలైట్ల థర్డ్‌లైన్‌ను ఏర్పాటు చేయడం, విధిగా ఎల్ఈడీ బల్బులను అమర్చడం, వంగిపోయి ప్రమాదకరంగా ఉన్న స్తంభాలు, వేలాడే కరెంటు తీగలను గుర్తించి సరిచేయడం, పొడవాటి కట్టెలు, ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను నాటడం చేయాల్సి ఉంటుంది. ఇక హరితహారం కార్యక్రమంలో భాగంగా విలేజ్ నర్సరీని ఏర్పాటు చేయడం, గ్రామాల్లో వీధివీధిన విరివిగా మొక్కలు నాటి వాటికి నీళ్లు పోసి రక్షించడం, పెట్టిన మొక్కలన్నీ చెట్లుగా ఎదిగే వరకూ బాధ్యత తీసుకోవడం, ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేసి యజమానులు, రైతులతో మాట్లాడి పెద్దఎత్తున చింత మొక్కలు సరఫరా చేయాల్సి ఉంటుంది. రోడ్లు, వీదిలైట్లు, పాడుబడిన బావులు, శిథిలమైన ఇళ్లు, బోరుబావులు, మురికి కాల్వలను పరిశీలించి ఎక్కడెక్కడ ఎలాంటి పనులు అవసరమో పరిశీలించి అభివృద్ధి ప్రణాళికలో ప్రతిపాదించి బడ్జెట్ కేటాయించాలి. అధికారుల పర్యటనలో ప్రతిపాదించిన పనులకు గ్రామసభ ఆమోదంతో నిధులు ఖర్చు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. పల్లె పాలనను గాడిలో పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం మేరకు రూపొందించిన కొత్త చట్టం ప్రకారం ఇకపై పంచాయతీల్లో భిన్నమైన మార్పులు, చేర్పులతో గ్రామీణ పాలనపై పర్యవేక్షణ పెరగడంతోపాటు సమస్యల పరిష్కారానికి మార్గం ఏర్పడి అభివృద్ధి పరుగులు పెట్టనుంది.

## గ్రామాల అభిశృద్ధికి నిధుల కేటాయింపు

### ఆమోదం పొందిన పనులకు ప్రాధాన్యం
### 30 రోజుల ప్రణాళికలో వినియోగం

యాదాద్రి భువనగిరి,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): గ్రామాలను ప్రగతిపథంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు విడుదల చేస్తున్నది. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వెచ్చించనున్నారు. జనాభా పెరుగుదల, అవసరాల దృష్ట్యా ప్రభుత్వం నుంచి అందిన నిధులు సరిపోని పక్షంలో ఆయా గ్రామాల్లో దాతల నుంచి విరాళాలు సేకరించి గ్రామ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడంపై సంబంధిత కమిటీ సభ్యులు దృష్టి సారించారు. ప్రభుత్వం, అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల నుంచి విరాళాల సేకరణతో పాటు గ్రామాల్లో ఉన్న వివిధ రకాల పన్నులను వసూలు చేసి గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను అభివృద్ధి చేసే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు, కమిటీ సభ్యులు కదులనున్నారు. దీని కోసం ప్రతి కమిటీలో 15- 30 మంది వరకు సభ్యులు ఉండేలా ప్రతి గ్రామ పంచాయతీలో నాలుగు కమిటీలను ఏర్పాటు చేసి బాధ్యతాయుతంగా నిధులు ఖర్చు చేయాల్సిన అవశ్యకతను సీఎం కేసీఆర్ తన సందేశంలో స్పష్టం చేశారు.గ్రామ స్వరాజ్యం సాధించానే లక్ష్యంతో గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్‌తో పాటు మౌలిక వసతుల కల్పనకు సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారు. 30 రోజుల ప్రణాళిక అమలుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల అవసరాలు, గ్రామాల అభివృద్ధి కోసం గ్రామ పంచాయతీలకు భారీగా నిధులను విడుదల చేశారు. పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన నిధులను కేటాయించారు. సాధారణ నిధుల నుంచి 14వ ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యాయి. 30 రోజుల ప్రణాళికలో భాగంగా ఈ నిధులను ఖర్చు చేయాల్సి ఉంటుంది. 30 రోజుల తర్వాత జిల్లాలో ఫ్లయింగ్ స్కాడ్ బృందం పర్యటిస్తుంది. ప్రణాళికలో లోటుపాట్లు ఏమైనా ఉంటే ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులపై చర్యలు తీసుకోనున్నారు.

గ్రామాల అభివృద్ధికి 30 రోజుల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించి గ్రామాల్లో గుర్తించిన అభివృద్ధి పనులను ఆర్థిక క్రమ శిక్షణతో పూర్తి చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రభుత్వం ఆదేశించింది. విడుదలైన నిధులు, దాతల నుంచి సేకరించిన విరాళాలు, గ్రామ పంచాయతీ వసూలు చేసే పన్నులపై దృష్టి సారించి స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ పనులను పూర్తి చేయాలని సూచించింది. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు శిక్షణను ఇచ్చారు

## గ్రామాల అభివృద్ధిపై ప్రజల్లో ఆసక్తి

### గ్రామాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్న ప్రజలు
### జిల్లా పంచాయతీ అధికారి ఎం రఘువరణ్ పర్యవేక్షణ

కరీంనగర్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై మొదటి రోజు నుంచే గ్రామీణ ప్రజల్లో ఆసక్తి నెలకొన్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని గ్రామాల్లో మొదటి రోజు గ్రామ సభలు నిర్వహించారు. ప్రతి గ్రామసభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన సందేశాన్ని చదివి వినిపించారు. ప్రత్యేక ప్రణాళిక ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. అనేక గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను జిల్లా పంచాయతీ అధికారి ఎం రఘువరణ్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని కూడా ప్రత్యేకాధికారులు నియమించారు. వీరు కాకుండా ఎంపీడీఓలు, ఎంపీఓలు కూడా గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. 30 రోజుల ప్రణాళికపై గ్రామాల్లోని గోడలపై నినాదాలు రాయాలనీ, ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యం విస్తృతంగా పెంచాలనీ, అలాంటప్పుడే గ్రామాల్లో సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. పాదయాత్రల ద్వారా గుర్తించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు అవసరమైన వార్షిక, పంచవర్ష ప్రణాళికలను గ్రామ సభలు ఏర్పాటు చేసి అందరి సమక్షంలో రూపొందించుకోవాలని సూచించారు. శ్రమదాన కార్యక్రమాల్లో స్థానిక యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలను ఎక్కువ భాగస్వామ్యులను చేయాలని సూచించారు. అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లో పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్‌రాజ్‌తోపాటు రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్, కలెక్టర్ సర్ఫరాజ్‌అహ్మద్ పాల్గొన్నారు. ప్రభుత్వం అందించిన ఈ 30 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాలను పరిశుభ్రంగా మార్చుకోవడం, పచ్చదనం పెంచే కార్యక్రమాలను చేపట్టడం, ప్రజల భాగస్వామ్యాన్ని విస్తృతంగా పెంపొందించడం, వార్షిక, పంచవర్ష ప్రణాళికలు తయారు చేయడం, నియంత్రిత పద్ధతిలో నిధులు వినియోగం, ప్రజా ప్రతినిధులు, అధికారుల్లో జవాబుదారీతనం పెంచడం వంటి ప్రధాన లక్ష్యాలతో చేపట్టిన ఈ కార్యక్రమంపై రోజు రోజుకూ ప్రజల్లో ఆసక్తి కలుగుతోంది. పంచాయతీలు, అధికారులు చేపట్టిన విస్తృత ప్రచారం ప్రజల్లో చైతన్యం రగిలిస్తోంది. తమ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకోవాలనే సంకల్పం ప్రతి గ్రామంలో కనిపిస్తోంది. ఈ నెల 9 నుంచి గ్రామాల్లో అధికారులు, స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, స్థాయీ సంఘాల సభ్యులు పాదయాత్రలు చేపట్టారు. ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు కూడా అక్కడక్కడా పాల్గొని ప్రజల్లో ఉత్సాహం నింపుతున్నారు. గ్రామాల్లోని వీధుల్లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను గుర్తిస్తున్నారు. నాలుగు ప్రధానాంశాలపైన దృష్టిసారిస్తున్నారు. పారిశుధ్యంలో

కూలిన ఇండ్లు, పాడుబడిన పశువుల కొట్టాలు, వీధుల్లో పిచ్చి మొక్కల తొలగింపు, పాడుబడిన బావుల పూడ్చివేత, నిరుపయోగ బోర్ల తొలగింపు, మురుగు కాలువలను శుభ్రం చేయడం, ప్రభుత్వ కార్యాలయాలల్లో పారిశుధ్యం నెలకొల్పేందుకు, సంతలు, మార్కెట్ల ప్రదేశాలను శుభ్రం చేసేందుకు చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్త బుట్టల ఏర్పాటు, చెత్తను డంపింగ్ యార్డుల్లోనే వేసేలా స్థానికులను ప్రోత్సహించడం వంటి ప్రధాన అంశాలతోపాటు వైకుంఠధామాలకు స్థలాలను గుర్తించడం వంటి విషయాలను ఇందులో గుర్తిస్తున్నారు. . ప్రణాళికల తయారీలో సర్పంచు, ఉప సర్పంచు, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులతోపాటు తాజాగా ఎన్నుకున్న కో-ఆప్షన్ సభ్యులు, నాలుగు రకాల స్థాయీ సంఘాల సభ్యులు కీలకం కానున్నారు. గ్రామస్తులు కూడా ఈ ప్రణాళికలో విస్తృతంగా పాల్గొనాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో అనేక గ్రామాల్లో పెద్ద ఎత్తున గ్రామసభలు నిర్వహించి వార్షిక, పంచవర్ష ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆయా గ్రామాల పాలకవర్గాలు ప్రయత్నిస్తున్నాయి.

# ప్రణాళిక మేరకు నిధుల విడుదల జరగదా?

ఆదిలాబాద్, సెప్టెంబర్ 19 (ఆర్ఎన్ఎ): 30రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో

### గ్రామాల్లో అభివృద్ధికి నిధులే ఆటంకం

మండలానికో ప్రత్యేక అధికారిని కలెక్టర్ దివ్యదేవరాజన్ నియమించారు. కలెక్టర్ కూడా మావల మండలాన్ని ఎంచుకున్నారు. తద్వారా మిగతా అధికారులకు ఆమె స్ఫూర్తిగా నిలుస్తున్నారు. జేసీ సంధ్యారాణి, ఇతర జిల్లా అధికారులు కూడా ఒక్కో మండలానికి ప్రత్యేక అధికారులుగా ఈ కార్యాచరణలో భాగస్వాములు అయ్యారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. పంచాయితీలకు అరకొర నిధులు రావడంతో ప్రణాళిక వేసినా ముందుకు సాగని పరిస్తితి నెలకొంది. నిధుల విడుదలలో ఖచ్చితంవ రావడం లేదు. జనాభాలో అత్యధిక ప్రజలు నివసించేది గ్రామీణ ప్రాంతాల్లోనే. గ్రామ పంచాయతీలకు 14వ ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మంజూర వుతాయి. కేంద్ర ప్రభుత్వం 14వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేస్తుంది. దానికి అదనంగా తలసరి ఒకరికి రూ. 806 చొప్పున జోడించి రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుంది. ఈ లెక్కన రెండు కలిపి తలసరి ఒకరికి రూ. 1612 కేటాయిస్తారు. జనాభా ఆధారంగా ఈ నిధులను పంచాయితీలకు మంజూరు చేస్తారు. జిల్లాలోని గ్రామీణ జనాభా ప్రకారం ఈ రెండు కలిపి ఏడాదికి రూ. 87.24 కోట్లు జిల్లాకు కేటాయించాలి. ఈ నిధుల వంతుల వారీగా ప్రతీ మూడు నెలలకోసారి మంజూరువుతాయి. ఈ లెక్కన జిల్లాకు రూ. 21.81 కోట్లు మొదటి విడత మంజూరు కావాలి. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా పంచాయతీలకు నిధులు విడుదల చేస్తామని చెప్పింది. ఇటీవల జిల్లాకు ఈ రెండు నిధులు కలిపి రూ. 8.96 కోట్లు మంజూరు చేశారు. అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వ నిధులకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వ నిధులు రాలేదు. అరకొరగా వచ్చిన నిధులతో ప్రస్తుతం చిన్నపాటి పనులే చేయాల్సి వస్తోంది. ఈ లెక్కన గ్రామ కార్యాచరణలో భాగంగా ఈ 30 రోజుల్లో గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, హరితహారం వంటి పనులు వేగంగా సాగుతున్నాయి. మిగతా సమస్యలను గుర్తిస్తున్నారు. మంజూరైన ఈ నిధుల్లో పారిశుధ్యం కోసం 15 శాతం, హరితహారానికి 10 శాతం, విద్యుత్ అవసరాలకు 10 శాతం, కార్యాలయ నిర్వహణకు 5 శాతం, ఇతర ఖర్చులకు 10 శాతం నిధులను కేటాయించినట్లు క్షేత్రస్థాయిలో అధికారులు పేర్కొంటున్నారు. మిగతా 50 శాతం నిధులను అభివృద్ధి పనులకు కేటాయించాలి. ప్రస్తుతం గ్రామాల్లో గుర్తించిన సమస్యలకు సంబంధించి ఏటా.. ఐదు సంవత్సరాలకు సంబంధించి పంచవర్ష ప్రణాళికలు రూపొందించాలి. వార్షిక ప్రణాళికలో ఖర్చు చేయగా మిగిలిన నిధులను వచ్చే వార్షిక ప్రణాళికకు బదిలి చేయాలి. అయితే ప్రస్తుతం కార్యాచరణలో భాగంగా ప్రధానంగా కొత్త గ్రామపంచాయతీలకు సొంత భవనాలు లేవు. వాటి కోసం స్థలాలను గుర్తిస్తున్నారు. ఏదైనా పంచాయతీలో శ్మశానవాటిక లేకపోతే దానికోసం స్థలాలను గుర్తిస్తున్నారు. చెత్త తరలింపు కోసం డంపింగ్ యార్డు స్థలాన్ని కూడా గుర్తిస్తున్నారు. అయితే 50 శాతం నిధులతో ఈ పనులను చేపట్టలేని పరిస్థితి ఉంది. ప్రధానంగా శ్మశానవాటికలు, డంపింగ్ యార్డులకు సంబంధించి ఈజీఎస్‌లో చేపడుతున్నారు. తద్వారా వాటికి ఇక ఆ నిధులే శరణ్యం. కొత్త పంచాయతీలకు భవనం కోసం నిధులు వీఆర్ ద్వారా కేటాయిస్తారా?.. ఎలా అన్నది అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. ఇక నర్సరీలకు స్థలం కేటాయింపు విషయంలోనూ ఇలాంటి పరిస్థితే ఉంది. ఇదిలా ఉంటే హరితహారంలో భాగంగా పంచాయతీలో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణ కోసం ట్రీగార్డులు కేటాయించకపోగా ముళ్ల కంచెలనే ఏర్పాటు చేసుకోవాలని చెప్పడం ఏవిధంగా సబబన్న ప్రశ్న తలెత్తుతోంది.

# కాళేశ్వరంపైనే రైతుల ఆశలు

### ఎస్సారెస్పీలోకి దండిగా నీరు చేరితేనే పంటలు

నిజామాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి రోజుకి ఒక టీఎంసీ చొప్పున కాళేశ్వరం జలాలను తరలిస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో పాటు అందుకు అనుగుణంగా పనులు కొనసాగుతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి కాళేశ్వరం జలాలు రావాలంటే రాజేశ్వర్‌రావుపేట్ వద్ద ఏర్పాటు చేసిన పంపుల ద్వారా వరద కాలువలోకి నీటి పంపింగ్ చేపట్టాలి. ఈ మేరకు రాజేశ్వర్‌రావుపేట్ నుంచి వరద కాలువలోకి నీటి పంపింగ్ ప్రయోగత్మకంగా చేపట్టారు. ఈ నీరు వరద కాలువలోకి రావడంతో అక్కడి ప్రాంత రైతులు ఆసక్తిగా తిలకించారు. దీంతో ఇప్పుడు ఎస్సారెస్పీ కింద రైతులు కాళేశ్వరంపై ఆశగా ఉన్నారు. అక్కడి నుంచి నీటిని పంపింగ్ చేస్తేనే సమస్య తీరుతుందన్న భావనలో ఉన్నారు. వరద కాలువలోని నీరు ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ కాలువ గేట్ల ద్వారా ప్రాజెక్టులోకి చేరుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే వరదకాలువలో నుంచి ఎలాంటి పంపింగ్ లేకుండా నేరుగా ప్రాజెక్ట్‌లో 1077 అడుగుల వరకు నీటిమట్టం చేరే వరకు వెళ్తుంది. అనంతరం ప్రాజెక్ట్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న పంపుల ద్వారా ప్రాజెక్ట్‌లోకి నీటిని ఎత్తిపోయనున్నారు. ఎగువ ప్రాంతం నుంచి ఆశించిన స్థాయిలో వరదనీరు రాని కారణంగా ఎస్సారెస్పీ ఆయకట్టు రైతాంగం కాళేశ్వరం జలాలపైనే ఆశలు పెంచుకున్నారు.శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి ఆశించిన స్థాయిలో వరద నీటి చేరిక జరగడం లేదు. దీంతో ప్రాజెక్టు ద్వారా పంటలకు నీరందించే కాకతీయ, సరస్వతీ, లక్ష్మీ కాలువల పరిధిలోని ఆయకట్టుకు రెండు పంటలకు నీరందించే పరిస్థితి కనబడడం లేదు. ఈ నెలలోనే ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతం నుంచి భారీ స్థాయిలో వరదనీరు వచ్చి చేరితేనే ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పెరిగే అవకాశం ఉంది. వారం క్రితం ప్రాజెక్ట్‌లోకి 50వేల క్యూసెక్కుల వరదనీరు ప్రవాహం మూడు రోజుల పాటు కొనసాగింది. దీంతో ప్రాజెక్ట్‌లో నీటిరాక కొంతమేర పెరిగింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతం నుంచి 4500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 1070 అడుగల నీటిమట్టం నమోదు కాగా 30టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. అయితే ఇప్పటి దాకా ప్రాజెక్ట్ నుంచి కాలువ ద్వారా ఈ సీజన్‌లో నీటి విడుదల జరగలేదు. కాలువ పరిధిలోని చెరువులు కొంతమేర ఖాళీగానే ఉన్నాయి. అయితే చెరువులను నింపడానికి వచ్చే నెలలో నీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉంటుంది. ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలు సరస్వతీ, కాకతీయ కాలువలకు నీటిని వారబందీ పద్ధతి ద్వారా విడుదల చేసి చెరువులు నింపడానికే సరిపోతుంది. అయితే ప్రాజెక్ట్‌లో వరద నీరు రాకముందు 5 టీఎంసీల నీరు ఉండగా ఇప్పటి దాక ఈ సీజన్‌లో ప్రాజెక్ట్‌లోకి 25 టీఎంసీల నీరు వచ్చి చేరింది. కాకతీయ, లక్ష్మీ, సరస్వతీ కాలువల పరిధిలోని ఆయకట్టు మొత్తానికి రెండు పంటలకు నీరందిం చాలంటే కనీసం ప్రాజెక్ట్‌లో 75 టీఎంసీల నీరు నిల్వ ఉంటేనే సాధ్యమవుతుంది. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనబడడం లేదు. దీంతో ఇప్పట్లో కాలువల ద్వారా సైతం నీరు విడుదల చేసే పరిస్థితి లేదు.

# రైతులపై అధిక వడ్డీ భారం పడకుండా చూడండి

### -కేంద్రాన్ని కోరిన తెలంగాణ

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలపై అధిక వడ్డీ భారం పడకుండా చూడాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. న్యూడిల్లీలోని కృషి భవన్‌లో కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శి సంజయ్ అగర్వాల్, ఇతర అధికారులతో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్, ముల్కనూరు కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ..రైతులు ప్రాథమిక సహకార సంఘాల ద్వారా రుణాలు పొందుతారని అన్నారు. వడ్డీ 7 శాతానికి ఎక్కువ కాకుండా రుణాలు ఇస్తున్నారని చెప్పారు. ప్రాథమిక సహకార సంఘాలు సహకార బ్యాంకుల నుంచే కాకుండా కమర్షియల్ బ్యాంకుల నుంచి కూడా రుణం పొందాయన్నారు. ప్రాథమిక సహకార సంఘాల ద్వారా సమారు 2.5 లక్షల మంది రైతులు రూ. 550 కోట్ల రుణాలు పొందుతున్నారని, అయితే వారిపై అధిక వడ్డీ భారం పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి కేంద్ర అధికారులు సానుకూలంగా స్పందించారని వినోద్ కుమార్ తెలిపారు.

# ప్రాణహిత కోసం రైతుల ఎదురుచూపు

## రాజకీయ పార్టీల డిమాండ్ కూడా అదే

## ఎటూ తేల్చని అధికార పక్షం

ఆదిలాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): ప్రాణహితపై బ్యారేజీ నిర్మాణం విషయంలో ఇప్పటికీ ఎటువంటి అధికార ప్రకటన చేయకపోవడంతో ప్రతిపక్షాలు తరచూ ఆందోళన చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఇక్కడి రైతులకు సాగు నీరందిస్తామని తరచూ పార్టీ రాష్ట్రస్థాయి అగ్ర నాయకులు హామీ ఇస్తున్నారు. దీనిని చేపట్టాలని ఇటీవల కాంగ్రెస్ నేతుల ఇక్కడ యాత్రలుకూడా చేశారు. తోణమే ఇది పూర్తి చేయాలిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పదేపదే కోరుతున్నారు. మిగతా విపక్ష పార్టీలు సైతం తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి అనుకూలంగా ఉండడంతో ఎప్పటికైనా ప్రాణహితపై బ్యారేజీ నిర్మిస్తారనే ఆశల్లో ఇక్కడి రైతులు ఉన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఈ ప్రాజెక్టుకు సంబంధించి చింతలమానేపల్లి, దహేగాం మండల పరిధిలో తవ్విన కాలువలు నిరుప యోగంగా మారాయి.ప్రాణహిత ప్రాజెకుపై జిల్లా రైతాంగానికి ఆశలు పోవడం లేదు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టాలనే డిమాండ్ బలపడుతున్న నేపథ్యంలో ఈ ఆశలు మరింత ఎక్కువత ౦న్నాయి. ప్రతిపక్షాలు ఇక్కడ ప్రాజెక్టు కట్టాలని ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్న నేపథ్యంలో ఈ బ్యారేజీ నిర్మాణంపై జిల్లా రైతాంగానికి ఆశలు సజీవంగా ఉంటున్నాయి. ఏటా వర్షాకాలలో ఉధృతంగా ప్రవహించే ప్రాణహిత నది ప్రవాహంలో లక్షల క్యూసెక్కుల నీరు జిల్లా రైతాంగం క్లళెదుటే గోదావరిలో కలిసిపోతూ దిగువ ప్రాంతానికి తరలిపోతోంది. ఈ నీటి లభ్యతనే వాడుకునేందుకు రూ.38వేల కోట్లతో కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లా పరిధిలోని 16.40 లక్షల ఎకరాలకు సాగు నీరందించాలని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టారు.ఈ మొత్తం ఆయకట్టులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోనే 1.56 లక్షల ఎకరాలకు సాగు నీరందించేలా ప్రణాళిక వేశారు. అయితే తెలంగాణ ఏర్పాటు అనంతరం ప్రాజెక్టుల రీడిజైన్‌లో భాగంగా బ్యారేజీ నిర్మాణం తుమ్మిడిహెట్టి నుంచి ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని కాళేశ్వరం సమీపంలోని మేడిగడ్డ వద్ద గోదావరిపై నిర్మించాలని యోచించడం, త్వరితగతిన ప్రాజెక్టు పనులు పూర్తవడం, ప్రస్తుతం ఎత్తిపోతలు కూడా ప్రారంభవయ్యాయి. అయితే తుమ్మిడిహెట్టి వద్ద మాత్రం ఎటువంటి కదలిక లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. దీనిపై త్వరితగతిన ఏదైనా నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుత ౦న్నారు. ఇక్కడ నీరు అందుతుందనే ఆశతో అనేక మంది రైతులు భూములు ఇచ్చి ప్రాజెక్టు ప్రారంభంలో ఆశ పడినా చివరకు ఇలా నిలిచిపోవడంతో అంతా నిరాశలో ఉన్నారు. ఆ తర్వాత ప్రభుత్వం ప్రాణహితపై బ్యారేజీ నిర్మిస్తే మహారాష్ట్రలో ముంపు అధికంగా ఉందని చెబుతు ముంపు తక్కువగా ఉన్న వార్ధపై బ్యారేజీ నిర్మించి ఈ కాలువలను ఉపయోగించుకోవాలని ప్రభుత్వం ఉన్నట్లు ప్రచారం జరిగింది. దీనిపై కూడా ఎటువంటి స్పష్టత రాలేదు. జిల్లాలో అపరిమితమైన సహజ నీటి వనరులున్నా రైతులకు ఆయకట్టు అందక పత్తి, సోయా, కంది, జొన్న వంటి ఆరుతడి పంటలకే పరిమతమవుతున్నారు. ఇప్పటికీ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైగా కేవలం పత్తి వంటనే ప్రధాన వంటగా పండిస్తున్నారు. వరి సాగు అంతంత మాత్రమే. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే వెనుకబడిన జిల్లాలో సాగు నీరందించడంతో వరి సాగు పెరిగి అభివృద్ధికి ఆస్కారం ఉంటుందని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. మరోవైపు జిల్లాలో ప్రాణహిత బ్యారేజీతో పాటు కుమురం భీం, వట్టివాగు, జగన్నాథపూర్ ప్రాజెక్టులు సైతం పెండింగ్‌లోనే ఉండి రైతులకు సాగు నీరందించే స్థితిలో లేకపోవడంతో ఏళ్లుగా సాగునీటికి తిప్పలు తప్పడం లేదు. ఇప్పటికీ ఈ ప్రాజెక్టు భవితవ్యం ఎటూ తేలకున్నా ఎప్పటికైనా బ్యారేజీ నిర్మితమవుతుందనే రైతుల ఆశలు సజీవంగా ఉంటున్నాయి.

# క్వార్టర్లు ఖాళీ చేయని మాజీలు

## కొత్త ఎంపిలకు తీవ్ర ఇబ్బందులు

## కిషన్ రెడ్డికి కూడా దక్కని అధికారిక క్వార్టర్

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): కొందరు ఎంపీల అధికారిక నివాసాల నుంచి ఖాళీ చేయకుండా గబ్బిలాల్లా పట్టుకుని వేలాడుతున్నారు. దీంతో కొత్తగా ఎంపికయిన వారికి ఆవాసం కల్పించడం కష్టంగా మారింది. హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన కిషన్ రెడ్డి కూడా ఇప్పుడుఉ ఎపి భవన్లోనే ఉంటున్నారు. ఆయనకు ఇంతవరకు క్వార్టర్ కేటాయించలేదు. మాజీ ఎంపీలకు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినవ్పటికీ ప్రయోజనం లేకుండాపోతోంది. ఢిల్లీలోని ఎంపీల అధికారిక భవనాల నుంచి ఇంకా 82 మంది మాజీలు ఖాళీ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వారిపై పబ్లిక్ ప్రెమిసెస్ చట్టాన్ని ప్రయోగించాలని కేంద్రం భావిస్తోంది. ఈ లోక్ సభకు కొత్తగా ఎంపికైన వారికి బంగళాలు కేటాయించాల్సి ఉండగా, మాజీ ఎంపీలు తమ నివాసాలను ఖాళీ చేయలేదు. దీంతో ప్రస్తుత ఎంపీలకు వేరే చోట్ల తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేశారు. గడువు ముగిసినా నివాసాలు ఖాళీ చేయని దాదాపు 200 మంది మాజీ ఎంపీలకు గతనెల 19న సీఆర్ పాటిల్ నేతృత్వంలోని లోక్‌సభ హౌసింగ్ కమిటీ వారంలోగా ఖాళీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మూడు రోజుల్లోగా కరెంటు, నీరు, వంటగ్యాస్ నిలిపివేస్తామని స్పష్టంచేసింది. దీంతో కొందరు నివాసాలను ఖాళీ చేయగా ఇంకా 82 మంది మాజీ ఎంపీలు అక్కడే తిష్ట వేశారు. ఖాళీ చేయనివారిపై కఠిన చర్యలుంటాయని లోక్‌సభ హౌసింగ్ కమిటీ పేర్కొంది.

# ఇక త్వరలో అన్నీ విద్యుత్ రైళ్లు

న్యూఢిల్లీ,సెప్టెంబరు 19(ఆర్ఎన్ఎ): రైల్లో ప్రయాణించినపుడు ఇకచుక్.. చుక్ అనే శబ్దాన్ని వినలేం. ఈ శబ్దం లేకుండా అన్నీ ఎలక్ట్రిక్ రైళ్లను పరుగెత్తించనున్నారు. డిసెంబర్ కల్లా రైళ్లు ఆ శబ్దం లేకుండా ప్రయాణం చేస్తాయని అధికారులు చెప్పారు. ఇప్పుడు రైళ్ల చివరల్లో ఉండే పవర్ కార్స్‌ను తొలగించి రైలుపైన కరెంటు తీగల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. తొలగించే పవర్ కార్ స్థానంలో బోగీ ఏర్పాటు చేసి లగేజీ, గార్డులకు వాడతామన్నారు. ఇందులో దివ్యాంగులకు 6 సీట్లను రిజర్వ్ చేయనున్నారు. మరో 31 సీట్లతో పాటు లగేజీ తీసుకెళ్లే సదుపాయం కల్పించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించేందుకు ఒక సైలెంట్ జనరేటర్ ఉంచనున్నారు. ప్రస్తుతం పవర్ కార్లు 105 డెసిబిల్స్ శబ్దం చేస్తుండగా ఇకపై అది ఉండదు.

## మట్టికప్పుల్లో ఇకచాయ్ సరఫరా

ఇకపై ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ డిపోల వద్ద ఉన్న స్టాళ్లు, ఎయిర్‌పోర్టులు, మాల్స్‌లో మట్టి కప్పుల్లో చాయ్‌ని ఆస్వాదించవచ్చు. ఈమేరకు కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ.. రైల్వే మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం వారణాసి, రాయ్‌బరేలీ రెండు రైల్వే స్టేషన్లలో మాత్రమే కేటరర్లు ఈ మట్టి కప్పుల్లో చాయ్‌ను అందిస్తున్నారు. 'సుమారు 100 రైల్వే స్టేషన్లలో, ఎయిర్‌పోర్టులు, రాష్ట్రాల్లోని బస్ డిపోల వద్ద ఉన్న టీ స్టాళ్లలో మట్టి కప్పుల్లోనే చాయ్‌ను అందించడాన్ని తప్పనిసరి చేయాలని గోయల్‌కు లేఖ రాశాను. దీంతో స్థానిక తయారీదారులకు మార్కెట్ లభించడంతో పాటు పర్యావరణానికి హాని కలిగించే పేపర్, ప్లాస్టిక్‌ల వాడకాన్ని నిషేధించినట్లవుతుందని వివరించారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు సేవాభావంతో ఉండాలి

## అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవు

ఆదిలాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు రోగుల నుంచి అధిక డబ్బులు వసూలు చేస్తే ఆస్పత్రులను సీజ్ చేస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చందు అన్నారు. డీఎంహెచ్‌వో చాంబర్‌లో పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ డెంగీ, టైఫాయిడ్ పేరుతో అధిక రుసుము వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, రోగులకు మానవత దృక్పథంతో వైద్యసేవలు అందించాలన్నారు. కొంత మంది వైద్యులు డెంగీ టెస్ట్‌ల పేరిట అధిక మొత్తంలో రోగుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వివరాలు అందిస్తే తగిన పారితోషకం అందజేస్తామన్నారు. రోగులను భయభ్రాంతులకు గురి చేయకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఇదిలావుంటే వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కుష్టు, టీబీ వ్యాధిగ్రస్తుల సర్వేలో ఏడుగురు కుష్టు వ్యాధిగ్రస్తులు, 18 టీబీ వ్యాధిగ్ర స్తులను గుర్తించి వైద్యచికిత్సలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ దవాఖానలో నాణ్యమైన సేవలు అందిస్తున్నాం. సర్వేలో స్పర్శలేని తెల్లమచ్చలు ఉన్నా, కాళ్లు చేతుల్లో పటుత్వం లేక పోయినా, చేతులు, కాళ్ల వేళ్లు వంకర్లు పోయినా కుష్టువ్యాధి లక్షణాలుగా గుర్తించాలని అన్నారు. దీర్ఘకాలంగా దగ్గుతో ఎవరైనా బాధపడుతున్నారా, బరువు తగ్గిపో వడం, తరుచూ జ్వరం రావడం వంటి క్షయ వ్యాధి లక్షణాలతో ఎవరైనా బాధపడుతున్నారా అనే విషయాలను తెలుసుకొని వారిని పరీక్షలు నిర్వహించి గుర్తించామన్నారు. వ్యాధులపై ఆశ కార్యకర్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు.

# భారత్ రెచ్చగొట్టే పద్దతి మానాలి

## ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొంటాం

## ప్రకటించిన పాకిస్థాన్

ఇస్లామాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరుపై భారత దేశం ఇస్తున్న ప్రకటనలు రెచ్చగొట్టేవిధంగా ఉన్నాయని పాకిస్థాన్ ఆరోపించింది.

ఇటువంటి వ్యాఖ్యల వల్ల ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతాయని హెచ్చరించింది. భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మంగళవారం మాట్లాడుతూ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు భారత దేశానిదేనని, దీనిపై భౌతిక అధికార పరిధిని ఏదో ఓ రోజు సాధిస్తామని ఆశిస్తున్నట్లు చెప్పిన సంగతి తెలిసిందే. జైశంకర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ పాకిస్థాన్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. కశ్మీరులో మానవ హక్కుల ఉల్లంఘనలపై అంతర్జాతీయంగా విమర్శలు కొనసాగుతుండటంతో, భారత దేశం తీవ్ర నైరాశ్యంలో చిక్కుకున్నట్లు జైశంకర్ వ్యాఖ్యలు స్పష్టంగా తెలియజేస్తున్నాయని ఆరోపించింది. పాకిస్థాన్‌ను నిందిస్తూ, అమాయక కశ్మీరీలపై భారత్ పాల్పడుతున్న నేరాల నుంచి అంతర్జాతీయ దృష్టిని మళ్ళించడం భారత దేశానికి సాధ్యం కాదని పేర్కొంది. భారత దేశ దూకుడును తీవ్రంగా పరిశీలించాలని అంతర్జాతీయ సమాజాన్ని పాకిస్థాన్ కోరింది. భారత్ చేస్తున్న వ్యాఖ్యలు ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉందని, ఈ ప్రాంతంలో శాంతిభద్రతలను పెను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని పేర్కొంది. పాకిస్థాన్ శాంతిని కోరుకుంటోందని, అయితే ఎటువంటి దురాక్రమణ చర్యపైన అయినా సమర్థంగా ప్రతిస్పందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపింది. ఐక్యరాజ్య సమితి తీర్మానాలకు అనుగుణంగా జమ్మూ-కశ్మీరు వివాదం పరిష్కారమవాలని తెలిపింది. జమ్మూ-కశ్మీరు రాష్ట్ర విభజన అనంతరం పాకిస్థాన్, భారత్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అంతర్జాతీయంగా భారత దేశంపై ఒత్తిడి తెచ్చేందుకు పాకిస్థాన్ చేసిన ప్రయత్నాలు విఫలమవుతున్నాయి. ముఖ్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సహా మధ్యప్రాచ్య దేశాలు కూడా పాకిస్థాన్‌కు మద్దతివ్వలేదు. కశ్మీరు వివాదం పూర్తిగా భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక వ్యవహారమని, దీనితో ముస్లిం సమాజానికి సంబంధం లేదని యూఏఈ స్పష్టం చేసింది.

# మోడీని జాతిపిత అన్న ఫడ్నవీస్ భార్య అమృత

## నెటిజన్ల విమర్శలతో చిక్కుల్లో ఇల్లాలు

ముంబై,సెప్టెంబర్19 (ఆంఎన్ఎ): ప్రధాని మోడీని జాతిపిత అన్న మహారాష్ట్ర సిఎం దేవంద్ర ఫడ్నవీస్ ÷- భార్య అమృత ఇప్పుడు చిక్కుల్లో పడ్డారు. ఆమెపై నెటిజన్లు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇంతకన్నా తెలివతక్కువతనం మరోటి లేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని 'జాతిపిత'గా పేర్కొంటూ వివాదాల తుట్టె కదిలించారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా ఈ మేరకు ట్విటర్లో శుభాకాంక్షలు చెప్పిన అమృతకు నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయి. బ్యాంకర్‌గా, గాయనిగా, సామాజిక కార్యకర్తగా గుర్తింపు పొందిన అమృత ఓ వీడియో షేర్ చేసుకుంటూ.... జాతిపిత నరేంద్ర మోదీ గారికి జన్మదిన శుభాకాంక్షలు. సమాజం అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించేందుకు ఆయనే మాకు స్ఫూర్తిఅని వ్యాఖ్యానించారు. ఆ మరుక్షణం నుంచే ఆమెకు నెటిజన్ల నుండి విమర్శల తాకిడి మొదలయ్యింది.మన జాతిపిత మహాత్మా గాంధీ.. కానీ ఇప్పుడు కొత్త జాతిపిత వచ్చారు. నరేంద్రమోదీ జాతిపిత ఎప్పుడయ్యారు? ఎలా అయ్యారు? నిరుద్యోగం పెరిగిపోయి, ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంటే.. సమాజంలో మీరు చెప్పిన అభివృద్ధి ఏం జరిగింది ?..అంటూ నెటిజన్లు ప్రశ్నలు కురిపించారు. గుజరాత్ కసాయి జాతిపిత ఎప్పుడయ్యారు?అంటూ మరొకరు ప్రశ్నించగా.. మీరు ఏ దేశం గురించి మాట్లాడుతున్నారో తెలియదు మేడం... కానీ నా దేశంలో జాతిపిత మాత్రం మహాత్మాగాంధీ.. అని మరొకరు తేల్చిచెప్పారు.

# కశ్మీర్‌లో అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారు

## – కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ) : జమ్మూ కశ్మీర్‌లో రాజకీయ శూన్యత సృష్టించి అవకాశవాద రాజకీయాలకు కేంద్ర పాల్పడుతుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీటర్ ద్వారా ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా వంటి నేతలను పక్కనబెట్టి రాజకీయ శూన్యం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని కేంద్రంపై మండిపడ్డారు. తద్వారా ఆ శూన్యాన్ని ఉగ్రవాదులు పూడ్చేస్తారని అప్పుడు కశ్మీర్‌ని అవకాశవాద రాజకీయాలకు వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాను కఠినమైన ప్రజా భద్రత చట్టం(సీఎస్ఏ) కింద అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అలాగే వివిధ పార్టీల నేతలు కూడా ఫరూక్ అబ్దుల్లా అరెస్టుపై తీవ్రంగా ధ్వజమెత్తారు. అబ్దుల్లా వంటి నేతలు ఉగ్రవాదులు కాదని అలాంటి వారిని గృహనిర్బంధంలో ఉంచడం దారుణమని సీపీఐఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరీ అన్నారు. వైగో పిటిషన్ కారణంగానే అబ్దుల్లాను ఇప్పుడు అరెస్టు చేశారా అని కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ ప్రశ్నించారు. గత నెల 5న రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేసినప్పటి నుంచి ఫరూక్ అబ్దుల్లా గృహ నిర్బంధంలో ఉన్నారు. పీఎస్ఏ కింద సోమవారం మధ్యాహ్నం ఫరూక్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆ తర్వాత శ్రీనగర్‌లోని ఆయన నివాసాన్ని జైలుగా ప్రభుత్వం ప్రకటించింది. ఫరూక్ కుమారుడు ఒమర్ అబ్దుల్లా, మరో మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ కూడా గత నెల 5 నుంచి నిర్బంధంలో ఉన్నారు.

# నాందేడ్ డివిజన్‌లో పలు రైళ్లు రద్దు

హైదరాబాద్,సెప్టెంబరు 19(ఆర్ఎన్ఎ): నాందేడ్ డివిజన్‌లోని ట్రాక్ మేయింటెనెన్స్ వల్ల నగరం నుంచి వెళ్లే పలు రైళ్లను దక్షిణమధ్య రైల్వే రద్దు చేసింది. ఈనిర్ణయం 18 నుంచి 20 వరకు కొనసాగుతుందని దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో రాకేశ్ తెలిపారు. మేడ్చల్ నుంచి నాందేడ్ మధ్య నడిపే డెమో ప్యాసింజర్‌తోపాటు, కాచిగూడ నుంచి మన్మాడ్ మధ్య నడిచే రైలుతో పాటు కాచిగూడ నుంచి నార్కెర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లను మూడురోజులపాటు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా తిరుపతి నుంచి నాందేడ్ మధ్య నడిచే రైలును ఈనెల18న విశాఖపట్నం నుంచి నాందేడ్ రైలు కూడా18న రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా ఆదిలాబాద్ నుంచి పర్లి వైజ్‌నాథ్ మధ్య నడిచే రైలును కూడా ఈనెల 18,19,20 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

# కరెంట్ షాక్‌తో దంపతుల మృతి

వరంగల్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): కరెంటు షాక్‌తో దంపతులు మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని రేపింది. వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం కాశగూడెంలో ఈ ఘటన చోటు చేసుకుంది. హైదర్ (40), గోరిబీ (38) దంపతులు కాశగూడెంలో నివాసముంటున్నారు. గోరిబీ బట్టలు ఆరేస్తుండగా ఆమెకు కరెంటు షాక్ తగిలింది. ఆమెను రక్షించేందుకు హైదర్ యత్నించి అతడు కూడా కరెంటు షాక్‌కు గురయ్యాడు. దీంతో దంపతులిద్దరూ మృతి చెందారు. ఈఘటనతో గ్రామస్తులు కలత చెందారు. వారి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

# లారీని ఢీకొన్న తుఫాన్ వాహనం: ఏడుగురికి గాయాలు

గద్వాల్‌జోగులాంబ,సెప్టెంబర్19 ఆర్ ఎన్ఎ): లారీని వెనుక నుంచి వచ్చి తుఫాన్ వాహనం ఢీకొనడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. ఉండవల్లి మండలం అలంపూర్ చౌరస్తా సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. లారీని వెనుక నుంచి తుఫాన్ వాహనం ఢీకొట్టింది. ఏడుగురికి గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

# ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి

ఆదిలాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

రైతులు వివిధ వంటల సాగులో ఆదర్శంగా నిలవాలని అన్నారు. నిరుపయోగంగా ఉన్న నూతన మార్కెట్ గోదామును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదామను త్వరలోనే వినియోగంలోకి తీసుకవస్తామని, రైతులు పండించిన పంటలను ఇక్కడే కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గోదాం ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. రైతులు పత్తి పంటలే కాకుండా వివిధ ఇతర వంటలను సైతం పండించాలన్నారు. రైతులు సేంద్రియ ఎరువులతో పాటు, ఆరుతడి పంటలపై దృష్టి పెట్టాలన్నారు.

# నేడు టీటీడీసీలో జాబ్‌మేళా

ఆదిలాబాద్,సెప్టెంబర్18 (ఆర్ఎన్ఎ): ఈ నెల 19న గురువారం జిల్లాకేంద్రంలోని టీటీడీసీలో జాబ్‌మేళాను నిర్వహించనున్నారు. నిరుద్యోగ యువతీ యువకులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు హైదరాబాద్, ఆదిలాబాద్ జిల్లాలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, హెల్త్‌కేర్, సెక్యూరిటీ సర్వీసెస్, రిటైల్ బ్యాంకింగ్, ఫార్మా, మార్కెటింగ్, ఆటో మోబైల్ వివిధ రంగాలకు సంబంధించిన 15 కంపెనీలు ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగులు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాల్సిందిగా కోరారు.

# గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

## మొక్కలు నాటి పచ్చదనం పెంచాలి: డిపివో

జనగామ,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళికతో పల్లెలు ప్రగతి సాధించాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు.వందశాతం ఓడీఎఫ్ సాధించేందుకు గ్రామాల్లో పూర్తి స్థాయిలో మరుగుదొడ్లు నిర్మించుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజలంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటి ఆవరణలో ఆరు మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, బ్యాగులను వాడొద్దన్నారు. గోనె సంచులను ఉపయోగించాలని సూచించారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. ఈ 30 రోజుల ప్రణాళికలో ప్రజాప్రతినిధులు, ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు బాధ్యతాయుతంగా పాల్గొనాలని కోరారు. పల్లెలు మురిసేలా ప్రగతి సాధించాలని డీపీవో పిలుపునిచ్చారు. పిచ్చిమొక్కలు, శిథిలావస్థలో ఉన్న పలు ఇళ్లను తొలగించడానికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతబోరు బావులను పూడ్చివేయాలన్నారు. ఇదిలావుంటే తాను పుట్టిన ఊరి రుణం తీర్చుకునేందుకు ఓ ఎన్నారై ముందుకొచ్చారు. ఈ మేరకు బొమ్మకూర్ అభివృద్ధికి రూ. 25,116 చెక్కును సర్పంచ్ బానోత్ శంకర్‌నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అమెరికాలో ఉద్యోగం చేస్తున్న బానోత్ క్రాంతికువార్ నాయక్ గ్రామాభివృద్ధికి విరాళం అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో చేపట్టిన 30 రోజుల కార్యాచరణతో పల్లెలకు కొత్త వెలుగులు వస్తున్నాయన్నారు. క్రాంతికుమార్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని తమకు తోచిన సాయం అందించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రత్యేకాధికారి పర్యవేక్షణలో గ్రామ పంచాయతీ పాలకవర్గం, కో ఆప్షన్ సభ్యులు హరితహారం, పారిశుధ్యం, వీధిదీపాలు పనుల కమిటీల సభ్యులు ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తున్నారన్నారు.

# పల్లెల అభివృద్ధి లక్ష్యంగా సాగాలి

## కెసిఆర్ లక్ష్యాన్ని ముందుకు తీసుకుని వెళ్లాలి: జడ్పీ ఛైర్మన్

జనగామ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): పల్లెల అభివృద్ధే ధ్యేయంగా సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీలకు నిర్దిష్టమైన చట్టాలు రూపొందించినట్లు జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి వివరించారు. గ్రామ పంచాయతీలకు స్వయం పరిపాలనా విధానాన్ని అమలు చేయడంతో వేగంగా అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాల అభివృద్ధికి దాతలు విరాళాలు అందించి, జన్మనిచ్చిన ఊరి రుణం తీర్చుకోవాలని కోరారు. గ్రామాల్లో పరిశుభ్రత, పచ్చదనం, విద్యుత్ అంశాలపై ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని సంపత్‌రెడ్డి సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజల సమష్టి కృషితోనే గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై జఫర్‌ఘడ్, రఘునాథపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో ఆయన అధికారులతో సమీక్షించారు. ముఖ్య అతిథిగా సంపత్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పరిసరాల్లో నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ ఇంటి ఆవరణలో ఏడేసి మొక్కలు నాటి కాపాడాలన్నారు. పల్లె బాగుపడితేనే నిజమైన అభివృద్ధి జరిగినట్లని సీఎం కేసీఆర్ భావించి, ఆ దిశగా చర్యలు చేపట్టారని జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి అన్నారు. 30 రోజుల ప్రణాళికలో గ్రామస్తులను భాగస్వామ్యం చేయాలన్నారు. వందశాతం మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కోరారు.

# గ్రామ ప్రణాళికను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి

జగిత్యాల,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామ పంచాయతీల ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా పరిషత్ ఏట శ్రీలతారెడ్డి అన్నారు. 30 రోజుల ప్రణాళికకు సంబందించిన అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి చెందేందుకు గానూ 30 రోజుల ప్రత్యేక ప్రణాళికను రూపొందించి అమలు చేసేందుకు గానూ నిధులను వెచ్చిస్తుందన్నారు. గ్రామ స్థాయిలో ప్రత్యేకాధికారులను నియమించి ఆయా గ్రామాల పరిధిలో కో-ఆప్షన్ సభ్యుల నియామకం, ప్రత్యేకంగా కమిటీలను నియమించుకున్నారని ఆ కమిటీ సభ్యుల ద్వా రా ప్రజలను భాగస్వాములు అయ్యేలా చొరవ చూపాలని అన్నారు. జిల్లా పరిధిలో 30 రోజుల కార్యాచరణకు గానూ ప్రత్యేకంగా షెడ్యూల్‌ను రూ పొందించామనీ, షెడ్యూల్‌కు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో చేపట్టిన ప్రతీ పనిని ప్రతినిత్యం ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. 30 రోజుల ప్రణాళికను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.

ఏపీ వార్తలు

# తిరుమలలో నగదు రహిత లావాదేవీలు

### బ్రహ్మోత్సవాల కోసం భారీగా ఏర్పాట్లు

### 30 నుంచి 8 వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుమల,సెప్టెంబరు 19 (ఆర్ఎన్ఎ): తిరుమలలో వసతి గదుల కేటాయింపులో నగదు రహిత లావాదేవీలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ ప్రత్యేకాధికారి ధర్మారెడ్డి తెలిపారు. అన్నమయ్య భవనంలో ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మూడు వారాల్లో గదుల కేటాయింపుల్లో నగదు రహిత లావాదేవీలను అమలు చేస్తున్నామని, భక్తుల నుంచి సానుకూల స్పందన లభిస్తోందన్నారు.తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈనెల 30 నుండి అక్టోబరు 8వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీటీడీలోని అన్ని విభాగాలు 25వ తేదీకి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు పూర్తి చేయాలని టిటిడి తిరుమల ప్రత్యేకాధికారి ఏ.వి. ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేకాధికారి సమీక్షించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా టిటిడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో సంతృప్తి కరంగా పనులు పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తిరుమలలో వసతి కేటాయింపు కౌంటర్ల వద్ద రెండు వారాల క్రితం ఏర్పాటు చేసిన స్వైపింగ్ యంత్రాలతో ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయకుండా నగదు రహిత విజయవంతమైన ఫలితాలను ఇచ్చిందని, శ్రీ పద్మావతి వసతి సముదాయాలలో 72 శాతం, సి.ఆర్ఓ (జనరల్), కౌస్తుభం వసతి కేటాయింపు కేంద్రాలలో 40 శాతం నగదు రహిత లావాదేవీలు జరిగినట్లు తెలిపారు. త్వరలో 100 శాతం నగదు రహిత చెల్లింపులు జరిపి మరింత పారదర్శకతతో భక్తులకు అందిస్తామన్నారు. తిరుమల, తిరుపతిలలో భక్తులకు లాకర్లు కేటాయింపు, నిర్వహణకు నూతన సాఫ్ట్‌వేర్ రూపొందించినట్లు తెలిపారు. తిరుపతిలో వసతి కొరకు ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ చేసుకుని, రద్దు చేసుకుంటే భక్తులకు కాషన్ డిపాజిట్లను వెంటనే చెల్లిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మరో 10 రోజులలో తిరుమలలోని కూడా కాషన్ డిపాజిట్లను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తిరుమల ఎస్వీ మ్యూజియంను మరింత ఆకర్షణీయంగా రూపొందించడంలో భాగంగా శ్రీవారి ఆలయానికి సంబంధించిన 3 డి ఇమేజింగ్‌ను సెప్టెంబరు 30వ తేదీ భక్తులకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అదేవిధంగా మ్యూజియం మొదటి అంతస్తులో దాతల సహకారంతో శ్రీవారి ఆభరణాలు 3 డి డిజైన్‌తో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మ్యూజియంలో నూతనంగా ఏర్పాటు చేయబోయే 3 డి వ్యవస్థ యొక్క ప్రోవో సమర్పించవలసిందిగా దాతలను కోరినట్లు తెలిపారు.

## అమ్మవారికి కాసుల హారం సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

విజయవాడ,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్లను గుంటూరు జిల్లా పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్‌రావు బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం నంబూరు శంకర్‌రావు దంపతులు అమ్మవారికి అలంకరణ నిమిత్తం తయారు చేయించిన 135 గ్రాముల బరువు గల బంగారు లక్ష్మి కాసుల హారాన్ని దేవస్థానం ఈవో ఎం.వి.సురేష్‌బాబుకు అందజేశారు. అమ్మవారికి బహుకరించిన హారంలో రాళ్ళ సూత్రాలు బంగారు తీగతో చుట్టబడి ఉన్నాయని, అందులో 62 లక్ష్మి కాసులు, 142 తెలుపు రాళ్ళు, 2 ఎరుపు రాళ్ళు మరియు నాన్‌కోడ్ ఉన్నాయని దాతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకర్‌రావు కుటుంబ సభ్యులకు వేదపండితులు వేదాశీర్వచనం గావించి అమ్మవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.

నెల రోజుల్లో..

# అయోధ్యకేసు విచారణ పూర్తిచేస్తాం

### - మధ్యవర్తిత్వంపై తమకెలాంటి అభ్యంతరం లేదు

### - కమిటీ సంప్రదింపులకు సమాంతరంగా విచారణ జరుగుతుంది

### - స్పష్టం చేసిన సుప్రింకోర్టు

న్యూఢిల్లీ, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ) : ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న అయోధ్య కేసులో గత కొన్నిరోజులుగా సుప్రీం కోర్టులో విచారణ సాగుతోంది. అయోధ్య అంశంపై 26వ రోజు విచారణ జరగ్గా, సుప్రీం కోర్టు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.

అక్టోబరు 18లోపు విచారణ పూర్తిచేస్తామని పేర్కొంది. బుధవారం కూడా సుప్రీంకోర్టులో ఆయోధ్య కేసుపై విచారణ జరిగింది. అక్టోబరు 18తో వాదనలు ముగుస్తాయని ధర్మాసనం, అదేరోజున విచారణ కూడా పూర్తి చేస్తామని వెల్లడించింది. ఈ విషయాన్ని ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం బుధవారం స్పష్టం చేసింది. అక్టోబరు 18నాటికి ఈ కేసు విచారణ పూర్తిచేయనివ్వాలంటూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగొయ్ కోరారు. అదే రోజున కోర్టు తీర్పును రిజర్వ్ చేసే అవకాశం ఉంది. నవంబర్ 17న సీజే రంజన్ గొగొయ్ పదవీకాలం ముగియనుండటంతో ఈ లోపు అయోధ్య వివాదంపై తీర్పు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేసులోని పార్టీలు మధ్యవర్తిత్వాన్ని కొనసాగించాలని కోరుకుంటే తమకెలాంటి అభ్యంతరం లేదని సుప్రీం తెలిపింది. సమస్య పరిష్కారం కోసం మధ్యవర్తిత్వ కమిటీ ప్రయత్నాలు చేయవచ్చని వెల్లడించింది. కమిటీకి పరిష్కారం దొరికినట్లయితే దాన్ని కోర్టు ముందుకు తీసుకురావచ్చని అభిప్రాయపడింది. ఎప్పటిలాగే మధ్యవర్తిత్వ కమిటీ సంప్రదింపులను గోప్యంగా కొనసాగించాలని సూచించింది. ఈ కమిటీతో పాటు కోర్టులో విచారణ సాగుతుందని సుప్రింకోర్టు తెలిపింది.

# మోడీ చర్యలతో ఆర్థికరంగం కుదుట పడదు

### –ట్విట్టర్ వేదికగా ప్రియాంక విమర్శలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చర్యలతో ఆర్థకమందగమనానికి హామీ దక్కడం లేదనియూపి కాంగ్రెస్ తూర్పు ఉత్తర ప్రదేశ్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనం నేపథ్యంలో మోదీ విదేశాల్లో నిర్వహించే భారీ కార్యక్రమాల వల్ల ఒరిగే ప్రయోజనం ఏమీ ఉండదన్నారు. ట్విటర్ వేదికగా ఆమె మోదీపై ఘాటు విమర్శలు గుప్పించారు. ట్రిలియన్ డాలర్లు అంటూ రోజూ మాట్లాడటం కానీ, పత్రికల పతాక శీర్షికలను మలచుకోవడం కానీ భారత దేశ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచబోవని ప్రియాంక గాంధీ ట్వీట్ చేశారు. విదేశాల్లో నిర్వహించే కార్యక్రమాలు పెట్టుబడిదారులను ఆకర్షించడానికి దోహదపడబోవన్నారు. మదుపరుల నమ్మకం దెబ్బతిందని, అయినప్పటికీ ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించాలనుకోవడం లేదని అన్నారు. ఆర్థిక మహాశక్తిగా ఎదగాలనుకుంటున్న భారత దేశానికి ఈ మందగమనం ఓ వేగ నిరోధకమని పేర్కొన్నారు. నెల 22న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికాలోని హూస్టన్‌లో 'హౌదీ మోదీ' కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఈ కార్యక్రమానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా హాజరవుతారు. ఈ నేపథ్యంలోనే ప్రియాంక గాంధీ ఈ ట్వీట్ చేశారు.

# 29 నుంచి కపిలేశ్వరాలయంలో దసరా ఉత్సవాలు

తిరుపతి,సెప్టెంబరు 19(ఆర్ఎన్ఎ): తిరుపతి శ్రీ కపిలేశ్వరాలయంలో 29 నుండి అక్టోబరు 8వ తేదీ వరకు శ్రీ దేవీనవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. దేవీనవరాత్రి ఉత్సవాలు సెప్టెంబరు 29న కలశ స్థాపనతో ప్రారంభమై, అక్టోబరు 8న కలశాభిషేకం, పార్వేటి ఉత్సవంతో ముగుస్తాయని తెలిపారు. ఈ మేరకు ఉత్సవాల గోడపత్రికలను టిటిడి తిరుపతి జెఈవో పి.బసంత్‌కుమార్ ఆవిష్కరించారు.

సెప్టెంబరు 30 నుండి అక్టోబరు 7వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం స్నపన తిరుమంజనం జరుగుతుందని, సాయంత్రం ఊంజల్‌సేవలో శ్రీకామాక్షి అమ్మవారు ప్రత్యేక అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. సెప్టెంబరు 30న శ్రీ కామాక్షి దేవి, అక్టోబరు 1న ఆదిపరాశక్తి, అక్టోబరు 2న శ్రీ అన్నపూర్ణాదేవి, అక్టోబరు 3న మావడి సేవ, అక్టోబరు 4న శ్రీ లక్ష్మీదేవి, అక్టోబరు 5న శ్రీ దుర్గాదేవి, అక్టోబరు 6న శ్రీ సరస్వతి దేవి, అక్టోబరు 7న శ్రీ మహిషాసురమర్ధిని అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలియజేశారు. అక్టోబరు 8న విజయదశమినాడు శ్రీ శివపార్వతులు దర్శనమిస్తారని, అదేరోజు పార్వేట ఉత్సవం జరుగుతుందని వెల్లడించారు.

## ఆలయ గోపుర కలశం చోరీ

కడప,సెప్టెంబర్19 (ఆర్ ఎన్ఎ): కడప జిల్లా నందలూరులోని ప్రసిద్ధ శ్రీ సౌమ్యనాధస్వామి ఆలయ గోపురంపై పంచలోహ కలశం చోరీకి గురయ్యింది. ఆలయ గోపురంపై పంచలోహ కలశం చోరీకి గురవడం స్థానికంగా కలకలం రేపింది. ఆలయ అధికారులు మాత్రం తెలిసీ తెలియనట్టు మిన్నకుండి పోయారు. అయితే ఓ భక్తుడి ఫిర్యాదుతో ఈ చోరీ ఉదంతం వెలుగులోకి వచ్చింది. దీంతో భక్తులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఇది ఎప్పుడు చోరీకి గురయ్యిందో చెప్పాలన్నారు. ఎందుకు మిన్నకుండి పోయారని ప్రశ్నించారు. ఇలా చోరీకి గురికావడం అపచారమని కొందరు అంటున్నారు.




ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టివి 5 ఛానెళ్ల పై నిషేధాన్ని ఎత్తివేయాలంటూ.. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక వద్ద బుధవారం నిరసన చేపట్టిన జర్నలిస్టులు

# కోడెలకు ప్రజలు, నేతల ఘన నివాళి

### తరలివచ్చిన టిడిపి శ్రేణులు

### నివాళి అర్పించిన బాలయ్య తదితరులు

గుంటూరు,సెప్టెంబర్19 ఆర్ఎన్ఎ): మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ పార్థివదేహానికి పెద్ద సంఖ్యలో నేతలు నివాళులు అర్పించారు. భారీగా తరలివచ్చిన టిడిపి శ్రేణులు ప్రజలు, అభిమానులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన పార్థివదేహం వద్ద కన్నీరుమున్నీరయ్యారు. హిందూపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణ నివాళులు అర్పించారు. కోడెల పార్థివదేహాన్ని చూసి బాలకృష్ణ భావోద్వేగానికి గురయ్యారు. కోడెల కుమారుడు శివరాంకు ధైర్యం చెప్పారు. స్వర్గపురి స్మశానవాటికలో అంత్యక్రియలు జరగనున్నాయి. కోట నుంచి కిలోమీటర్ మేర కోడెల అంతిమయాత్ర సాగనుంది. నరసరావుపేటలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ భౌతికకాయాన్ని చూసేందుకు పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు తరలివస్తున్నారు. మరోవైపు అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కోడెల భౌతికకాయానికి వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, లావు రత్తయ్య నివాళులర్పించారు. దివంగత కోడెలతో తనకు 40 ఏళ్ల అనుబంధముందని టీడీపీ నేత గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు. గుంటూరులో ఆయన కోడెల పార్థివదేహానికి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ.. ఏ శాఖ తీసుకున్నా పూర్తి అవగాహనతో పనిచేశారని కొనియాడారు. కోడెల ఆత్మహత్య చేసుకుంటాడని అనుకోలేదన్నారు. పల్నాడులో టీడీపీని దెబ్బతీయాలనే కోడెలను టార్గెట్ చేశారని విమర్శించారు. వైసీపీ ఇబ్బందికి గురిచేస్తోందని కోడెల తన ముందు ఏడ్చారని గోరంట్ల బుచ్చయ్యచౌదరి వెల్లడించారు. కోడెలను మానసిక క్షోభకు గురిచేశారన్నారు. ఈడీ కేసులో జగన్ జైలు ఊచలు లెక్కించక తప్పదని గోరంట్ల బుచ్చయ్య చౌదరి స్పష్టం చేశారు.

మాజీ స్పీకర్ కోడెల మృతిపై ఉయ్యూరులో టీడీపీ నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. శాంతియుత ప్రదర్శనను పోలీసులు అడ్డుకోవడంపై నేతలు మండిపడ్డారు. పోలీసుల జులుం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వ వేధింపుల వల్లే కోడెల బలవన్మరణానికి పాల్పడారని ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు గవర్నర్‌కు టిడిపి ఫిర్యాదు

టీడీపీ సీనియర్ నేత, మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్ ఆత్మహత్యపై అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న సంగతి తెలిసిందే. వైసీపీ ప్రభుత్వం వేధింపుల వల్లే కోడెల ఆత్మహత్య చేసుకున్నారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

ఈ క్రమంలో గురువారం నాడు.. ఏపీ గవర్నర్ హరిచందన్‌ను కలిసి కోడెల ఆత్మహత్యపై టీడీపీ బృందం ఫిర్యాదు చేయనున్నది. ముఖ్యంగా ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితులపై విచారణ జరిపించాలని గవర్నర్‌ను టీడీపీ నేతలు కోరనున్నారు. అదే విధంగా టీడీపీ కేడర్‌పై ప్రభుత్వం పెడుతున్న కేసులను ఈ సందర్భంగా గవర్నర్‌కు నేతలు వివరించనున్నారని తెలుస్తోంది.

## శిశువును కిడ్నాప్ చేయబోయి దొరికిపోయాడు

అమృత్‌సర్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): నాలుగేళ్ల శిశువును కిడ్నాప్ చేయడానికి యత్నించి ఓ వ్యక్తి కటకటలాపాలయ్యాడు. ఈ సంఘటన పంజాబ్ రాష్ట్రంలో చోటుచేసుకుంది. లుధియానాలోని రిషినగర్ ప్రాంతంలో గడిచిన రాత్రి ఇంటి బయట కుటుంబ సభ్యులతో శిశువు నిద్రిస్తుంది. కాగా ఓ వ్యక్తి రిక్షాపై వచ్చి తల్లి ఒడిలో నిద్రిస్తున్న శిశువును తీసుకుని రిక్షాలో పడుకోబెట్టి వెళ్లబోయాడు. కాగా సదరు మహిళ అలజడిలో అప్రమత్తమై దిగ్గున లేచి రిక్షాలో పడుకోబెట్టిన శిశువును తన చేతుల్లోకి తీసుకుంది. వెంటనే ప్రక్కన పడుకున్నవారు మరో మహిళ సైతం లేచి అప్రమత్తమయ్యేసరికి ఆ కేటుగాడు అక్కడి నుంచి రిక్షాతో పాటు ఊడాయించాడు. క్షణకాలం ఆలస్యమైనా శిశువు అదృశ్యమయ్యేది. ఈ విషయమంతా సీసీ కెమెరాలో రికార్డు కావడంతో నిందితుడిని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు.

## విద్యుత్ ఉద్యోగి దారుణ హత్య

రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని ముస్తాబాద్ మండలం కొండాపూర్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ శ్రీనివాస్‌ను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. శ్రీనివాస్ స్వస్థలం ఇల్లంతకుంట మండలం వంతడుపుల గ్రామం. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

# రియల్ వ్యాపారిపై కత్తులతో దాడి

### –పరిస్థితి విషమంతో వరంగల్‌కు తరలింపు

వరంగల్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లి వస్తున్న భార్యభర్తలపై గుర్తు తెలియని వ్యక్తులు కంట్లో కారం చల్లి మారణాయుధాలతో దాడి చేసిన ఘటన నర్సంపేటలో చోటుచేసుకుంది. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి అంబటి వెంకన్న రోజు ఉదయాన్నే తన భార్య విజయతో కలిసి వాకింగ్‌కు వెళుతుంటాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లి తిరిగివస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు వెంకన్న కళ్లలో కారంపొడి చల్లి కత్తులతో దాడి చేసి పారిపోయారు. భార్య విజయ వెంటనే తీవ్రంగా గాయపడిన వెంకన్నను నర్సంపేటలోని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. కానీ వెంకన్న పరిస్థితి విషమంగా ఉండడంతో మరింత మెరుగైన వైద్యం అందించేందుకు వరంగల్‌కు తరలించారు. కాగా, ఈ దాడికి భూవివాదమే కారణమై ఉంటుందని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

# కశ్మీర్ లోయలకు..

# ఉగ్రవాదులను పంపేందుకు పాక్ యత్నం

### – గ్రనేడ్ లాంచర్ల సాయంతో తిప్పికొట్టిన భారత్ ఆర్మీ

### – వైరల్‌గా మారిన వీడియో

కశ్మీర్, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ) : సరిహద్దుల్లో కవ్వింపు చర్యల ద్వారా ఉగ్రవాదులను దేశంలోకి ఎగదోసేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలను సైన్యం సమర్థంగా తిప్పికొడుతోంది. వాస్తవాధీన రేఖ వెంబడి ఉరి, పూంచ్, మెంధార్, నౌషేరా సెక్టార్ల సమీపంలో ఉగ్రవాదులు, పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీమ్ (బ్యాట్)లు పెద్ద సంఖ్యలో మోహరించి ఉన్నాయి. ఈ ప్రాంతంలో ఎస్ఎస్‌జీ దళాలను కూడా పాక్ తరలించింది. ఉగ్రవాదుల చొరబాటుకు గత నెల రోజుల్లో పాక్ సైన్యం చేసిన ప్రయత్నాలను ఆర్మీ భగ్నం చేసింది. సెప్టెంబరు 12-13 రాత్రి హాజీపూర్ సెక్టార్‌లో చొరబాటుకు పాకిస్థాన్ బోర్డర్ యాక్షన్ టీం చేసిన ప్రయత్నాలను భారత సైన్యం తిప్పుకొట్టిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఉగ్రవాదులను కశ్మీర్ లోయలకు పంపేందుకు పాకిస్థాన్ ఎస్ఎస్జీ దళాలు ప్రయత్నించాయి. దీన్ని గమనించిన ఆర్మీ.. అండర్ బ్యారెల్ గ్రనేడ్ లాంచర్ల సాయంతో వారిపై బాంబుల వర్షం కురిపించింది. దీంతో పాక్ సైన్యం తోకముడిచి వెనక్కు వెళ్లింది. ఆర్టికల్ 370ని రద్దుచేసిన తర్వాత నియంత్రణ రేఖ వెంబడి సైనిక స్థావరాలే లక్ష్యంగా పాక్ కాల్పుల ఉల్లంఘనకు పాల్పడుతోంది. ఎల్ఓసీ వద్ద ఉగ్రవాద శిబిరాలను పాక్ సైన్యం వినియోగించుకుని, దాడులకు తెగబడుతోంది. ఈ ఉగ్రవాద శిబిరాలు సరిహద్దుకు కొన్ని మీటర్ల నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. గ్యురేజ్, మచ్‌చల్, కెరాన్, తంగధర్, ఉరి, పూంచ్, నౌషెరా, సుందర్బనీ, ఆర్ఎస్ పుర, రామ్‌గఢ్, కథువా సమీపంలోని శిబిరాల్లో 250కిపైగా ఉగ్రవాదులు చొరబాటుకు సిద్ధంగా ఉన్నారని ఐబీ హెచ్చరికలు జారీచేసిన విషయం తెలిసిందే. సరిహద్దుల్లో చొరబాట్ల సమన్వయానికి, సులభతరం చేయడానికి కాళీఘాటిలో ఓ సమాచార కేంద్రాన్ని ఉగ్రవాదులు ఆగస్టు తొలివారంలో ప్రారంభించినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో లష్కరే తొయిబాకు చెందిన దౌరా ఈ ఆమ్‌లో కొత్తగా రిక్రూట్‌చేసుకున్న ఉగ్రవాదులకు శిక్షణ ప్రారంభించారు. జైషే మహ్మద్ సైతం ఇదే రకమైన శిక్షణను ప్రారంభించినట్టు ఐబీకి సమాచారం అందింది. ముజఫరాబాద్–మన్‌షెరా, కొట్లీ కేంద్రాల్లో ఈ శిక్ష కొనసాగుతోంది. ఉగ్రవాదులను లోయలోకి ఎగదోసే క్రమంలో హాజీపూర్ సెక్టార్‌లో భారత స్థావరాలపై పాక్ కాల్పులకు యత్నించగా సైన్యం దీటుగా తిప్పికొట్టింది. ఈ ఘటనలో పంజాబ్‌లోని బహావల్‌నగర్‌కు చెందిన పాక్ జవాన్ హతమయ్యాడు. ఈ మృతదేహాన్ని పాకిస్థాన్ సైన్యం తెల్ల జెండాలతో వచ్చి తీసుకెళ్లింది.

## ఇంటితాళం పగులగొట్టి చోరీ

మేడ్చల్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): జిల్లాలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కమలానగర్‌లో గడిచిన రాత్రి చోరీ ఘటన చోటుచేసుకుంది. ఇంటి తాళం పగలగొట్టి 17 తులాల బంగారం, రూ.3.5 లక్షల నగదును దొంగలు అపహరించుకుపోయారు. బాధిత యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలావుంటే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ బస్ డిపో ఎదుట జాతీయ రహదారిపై ప్రమాదం సంభవిచింది. లారీ ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు.

# ఉత్తమ్ ఉన్నంత కాలం అంతే సంగతులు: కోమటిరెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ఉత్తమ్ కుమార్ రెడ్డి, కుంతియా ఉన్నంతవరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జోస్యం చెప్పారు. సాంకేతికంగా తాను వచ్చే నాలుగేళ్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేనని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. 12 మంది ఎమ్మెల్యేలు పార్టీ వీడాక కాంగ్రెస్ పని ఖతమైందని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోతే గడ్డం తీసేస్తానన్న ఉత్తమ్... ఓడిపోయాక కూడా గడ్డంతోనే తిరుగుతున్నారని.. జనం ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ గెలుపోటములు ఉత్తమ్‌పై ఆధారపడి ఉన్నాయన్నారు.

తానింకా కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానని అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీజేపీలోకి వెళ్లాలనుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసే వెళ్తానన్నారు. తెలంగాణలో బీజేపీ బలపడుతోందని.. ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. కేసీఆర్ సాధు జంతువు లాంటి కాంగ్రెస్‌ను చంపి.. పులి లాంటి బీజేపీని బలపర్చారన్నారు. డిండి ప్రాజెక్టు భూసేకరణ నిధుల కోసం మంత్రి హరీశ్‌రావును కలిశానన్నారు. కాలేజీ రోజుల నుంచే హరీశ్‌రావు తనకు మంచి మిత్రుడని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు.

# హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

నిజామాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రకాశ్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రివాల్వర్‌తో ప్రకాశ్‌రెడ్డి కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని హుటాహుటిన నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రకాశ్ రెడ్డి అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు ప్రకటించారు. ఆత్మాహత్యాయత్నానికి గల కారణం తెలియాల్సి ఉంది. ఎస్ఐ తన రివాల్వర్‌ను స్టేషన్ లోనే ఉంచి ఇంటికి వెళ్లినట్లుగా సమాచారం. పీఎస్‌లో ఎవరూ లేని సమయంలో ఉదయం 8 గంటల ప్రాంతంలో ప్రకాశ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శబ్దం విని లోపలికి వచ్చే సరికి రక్తపు మడుగులో పడిఉన్నాడు. ఈ ఘటన పోలీస్ కుటుంబాల్లో కలకలం రేపింది. ఆత్మహత్యకు గలకారణాలను ఆరా తీస్తున్నారు.

## ఏపీ వార్తలు

# మూడోరోజు 10మృతదేహాల లభ్యం

**- గోదావరిలో గాలింపు చర్యలు ముమ్మరం**

**- ఇప్పటికీ 38మృతదేహాలు గుర్తింపు, మిగిలిన మృతదేహాలకోసం గాలింపు**

**- బోటు ఉన్న ప్రదేశాన్ని గుర్తించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది**

గుంటూరు, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ) : బోటు ప్రమాద ఘటనలో గల్లంతైన మృతదేహాల కోసం గాలింపు ముమ్మరంగా సాగుతుంది. కాగా బుధవారం మూడోరోజు గాలింపులో భాగంగా 10 మృతదేహాలను వెలికితీశారు. దేవీపట్నం వద్ద ఐదు మృతదేహాలను గుర్తించగా.. కొవ్వూరు మండలం కుమారదేవం వద్ద మరో మృతదేహాన్ని సహాయక సిబ్బంది వెలికితీశారు. మామిడికుదురు మండలం పాశర్లపూడి లంక వద్దకు 4 మృతదేహాలు కొట్టుకు వచ్చాయి.

మృతదేహాలను రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. పంచనామా నిర్వహించి మృదేహాలను బంధువులకు అప్పగిస్తున్నారు. ఈ ఘటనలో ఇప్పటివరకూ 38 మృతదేహాలను గుర్తించారు. గల్లంతైన మిగతావారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం వెలికితీసిన మృతదేహాలలో మహేశ్వర్‌రెడ్డి(నంద్యాల), రాజేంద్రప్రసాద్(వరంగల్ జిల్లా కడిపికొండ), శ్రీనివాసరావు (పశ్చిమగోదావరి జిల్లా పెదపాడు మండలం అప్పనవీడు), తాలిబ్ పటేల్(హైదరాబాద్ టౌలీచౌకీ), పెద్దిరెడ్డి దాలమ్మ(విశాఖ జిల్లా గోపాలపురం)లుగా గుర్తించారు. మిగిలిన మృతదేహాల వివరాలను గుర్తించే పనిలో అధికాలరుగు నిమగ్నమయ్యారు. మరోవైపు బోటు ఉన్న ప్రదేశాన్ని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గుర్తించింది. అత్యాధునిక స్కానర్లతో గాలింపు చేపట్టగా.. స్కానింగ్‌లో బోటు ఆనవాళ్లు కనిపించాయి. అయితే బోటుని ఎలా వెలికితీయాలనే దానిపై స్పష్టత లేదు. బోటు 300 అడుగుల లోతులో ఉండటం సమస్యగా మారింది. ప్రమాదానికి గురైన రాయల్ వశిష్ట టూరిస్ట్ బోటు 25టన్నుల బరువు ఉంది. బోటు ప్రమాదానికి గురైన ప్రాంతం ప్రమాదకర ప్రాంతం. వరద ప్రవాహం ఎక్కువగా ఉంది. సుడి గుండాలు అధికంగా ఉన్నాయి. దీంతో వాటన్నింటిని అధిగమించి బోటుని బయటికి తీసుకురావడం ఎలా అని చర్చలు జరుపుతున్నారు.

### రాష్ట్రాభివృద్ధి జరగాలంటే..

# వ్యాపార వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలి

**- ఏపీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి**

విశాఖపట్టణం, సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ) : ఏ రాష్ట్రమైనా అభివృద్ధిలో ముందుకెళ్లాలంటే వ్యాపార వాణిజ్యపరంగా అభివృద్ధి చెందాలని ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి అన్నారు.

బుధవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తలు మొదటి వాణిజ్య సదస్సు విశాఖలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రమైన అభివృద్ధిలో ముందడుగు వేయాలంటే వ్యాపార వాణిజ్యపరంగా అభివృద్ధి జరగాలన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రాన్ని ముందు ఉంచేలా శ్రమిస్తున్నామన్నారు. పరిశ్రమలు పెట్టాలంటే సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా సులువుగా అనుమతులు ఇచ్చే వద్ధతి అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. టోమొబైల్ రంగాన్ని అభివృద్ధి చేస్తామని, ఎలక్ట్రానిక్ వాహనాలు తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తామని మంత్రి మేకపాటి స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రంలో నూతన ఎలక్ట్రికల్ వాహనాల పాలసీ తీసుకువస్తామన్నారు. రాష్ట్రంలో నీటి వనరులు వినియోగించుకుని పరిశ్రమల అభివృద్ధికి పనిచేస్తామని, జిల్లాల వారీగా పరిశ్రమలకు కావలిసిన భూమి, ఇతర అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, పెట్టుబడులకు ఏపీ అనుకూలమని మంత్రి మేకపాటి గౌతంరెడ్డి పేర్కొన్నారు.

### ఆరోగ్యకర సమాజం లక్ష్యంగా ముందుకు

# పోషణ్ అభియాన్ రన్ ప్రారంభించిన కలెక్టర్

విజయనగరం,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ఆరోగ్యకర విజయనగరం సాధనలో భాగంగా.. పోషకాహార లోపాలను నివారించి మాతాశిశు మరణాలను తగ్గించడమే లక్ష్యంగా పోషన్ అభియాన్‌లో కార్యక్రమాలు చేపడుతున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరిజవహర్ చెప్పారు. బుధవారం ఉదయం పోషణ్ అభియాన్‌లో భాగంగా.. మహిళా శిశు సంక్షేమ శాఖ, వరల్డ్ విజన్ సంస్థల ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని మెసానిక్ టెంపుల్ నుండి నెహ్రూ యువ కేంద్రం వరకు రెండు కిలోమీటర్ల పరుగును కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చదనంతో, పరిశుభ్రతతో కూడిన ఆరోగ్యకర విజయనగరం జిల్లాగా రూపొందడం కోసం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నట్టు తెలిపారు. పోషన్ అభియాన్ కార్యక్రమంలో జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని, దీనిని కొనసాగించేలా అన్ని ప్రభుత్వ శాఖలు సమిష్టిగా కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయాల్సి ఉందన్నారు. పోషకాహార లోపం వల్ల చాలా మంది మహిళలు ప్రసవం దశలో చనిపోతున్నారని, పిల్లలు చిన్నతనంలోనే పుట్టిన ఏడాదిలోపే మరణిస్తున్నారని పేర్కొన్నారు. కొందరు పిల్లలు సజీవంగా ఉన్నా తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారని, ఈ విషయాలన్నీ పరిగణనలోకి తీసుకొని పోషణ్ మా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. సెప్టెంబరు 1 నుండి నెలాఖరు వరకు 'పోషణ్ మా' లో భాగంగా.. పలు ప్రభుత్వ శాఖల సమన్వయంతో కార్యక్రమాలు చేపడుతున్నట్టు వివరించారు. విద్య, వైద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఇప్పటికే అమలు జరుగుతున్న పలు కార్యక్రమాలను సమ్మిళితం చేసి అమలు చేస్తామన్నారు. వీటితోపాటు ప్రజల్లో పోషకాహార లోపంపై అవగాహన కలిగించేలా కొన్ని కార్యక్రమాలు చేపడతున్నామని పేర్కొన్నారు. ఇంటికి రేషన్ అందించే కార్యక్రమాలు నిర్ణీత గడువులోగా అమలుచేసేలా చూడటం, పిల్లలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం, శాఖల వారీగా చేపట్టిన కార్యక్రమాలను అప్‌డేట్ చేయడం ద్వారా ఈ కార్యక్రమంలో సమిష్టిగా చేయాల్సి ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పౌష్టికాహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని, దీనిలో భాగంగా వీడియో కాన్ఫరెన్సులో ప్రత్యేక ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. ప్రభుత్వ శాఖలన్నీ తమ పరిధిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను శత శాతం సంపూర్ణంగా అమలుచేస్తే మాతా శిశు మరణాలను తగ్గించగలమన్నారు. సెప్టెంబరు నెలలో ఒక షెడ్యూలు ప్రకారం.. ప్రతి వారం కొన్ని కార్యక్రమాలు చేపడుతున్నట్టు మహిళా శిశు అభివఅద్ధి సంస్థ ప్రాజెక్టు డైరక్టర్ ఎం.రాజేశ్వరి వివరించారు. ఈ పరుగులో.. దాదాపు 500 మంది యువత, మహిళలు, మహిళాశిశు సంక్షేమశాఖ సిబ్బంది, శిక్షణలో ఉన్న పోలీసులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గన్నారు. పరుగులో పాల్గన్న వారందరికీ సర్టిఫికెట్లు బహూకరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ విజన్ మేనేజర్ ఎం.శ్యాంబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి, ఎస్సీ. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ జి.జగన్నాధం, పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, పోలీసు శిక్షణ సంస్థ వైస్ ప్రిన్సిపల్ మెహెర్‌బాబా, బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కమిషన్ సభ్యులు కేసలి అప్పారావు, సిడబ్ల్యుసి. చైర్‌పర్సన్ వి.లక్ష్మణరావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ చామంతి, డిఆర్‌డిఏ ఏపిడి మురళి, తదితరులు పాల్గన్నారు.

### ఛానళ్ల నిషేధం భావప్రకటనను హరించడమే

# జర్నలిస్టు ఉపాధికి గండి కొట్టే చర్య

**విజయవాడలో జర్నలిస్ట్ సంఘాల నిరసన**

విజయవాడ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టివి 5 ఛానెళ్ల పై నిషేధాన్ని ఎత్తివేయాలంటూ.. ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక వద్ద బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటరావు మాట్లాడుతూ.. ప్రసార ఛానెళ్ల ను నిషేధించడం భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనన్నారు. ప్రసార ఛానెళ్లను నిలిపేయడంతో ఆ ఛానళ్లలో పనిచేసే సిబ్బందికి, జర్నలిస్టులకు ఉపాధి పోతుందని, పారదర్శకత గురించి మాట్లాడే పాలకులు తమకు అనుకూలంగా ఉన్న ఛానెళ్లను మాత్రమే ఆమోదించి, అనుకూలంగా లేని ఛానెళ్ల పై నిషేధాన్ని విధించడం పారదర్శకత కాదని అన్నారు. గతంలో సాక్షి ఛానెల్ పై నిషేధాన్ని విధించినప్పుడు కూడా ఎపిడబ్ల్యుజెఎఫ్ తరపున నిరసన చేపట్టామని గుర్తు చేశారు. ప్రభుత్వం తీసుకునే ఇలాంటి చర్యల వల్ల అనేకమంది తమ ఉపాధి కోల్పోతారని ఇది సరైన చర్య కాదని చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తక్షణమే ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టివి 5 ఛానెళ్ల పై నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శాంతి శ్రీ మాట్లాడుతూ.. మీడియా గొంతు నొక్కడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమైన చర్య అని అన్నారు. గతంలోనూ మీడియా పై ప్రభుత్వం ఆంక్షలు విధించినప్పుడు ఎపిడబ్ల్యుజెఎఫ్ తరపున అనేక పోరాటాలు చేశామన్నారు. ప్రసార ఛానెళ్లపై నిషేధం విషయమై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. అధికారులు స్పందించి వెంటనే ఎబిఎన్ ఆంధ్రజ్యోతి, టివి 5 ఛానెళ్ల పై నిషేధాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆంధప్రదేశ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాంబశివరావు, నాయకులు టివి.రమణ, ఎపి బిజెపి నాయకులు రుడారెడ్డి లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు వి.రామారావు, ఖాజావలి, నాథన్, శ్రీనివాసరావు, హవీద్, తదితరులు పాల్గొన్నారు.

# కరువు నివారణ చర్యలు చేపట్టండి: సిపిఎం

కడప,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): కరువు నివారణ చర్యలు చేపట్టాలని,రైతులను ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. సకాలంలో వర్షాలు లేక సీమలో తీవ్రదుర్భర పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు.

సిపిఎం ఆధ్వర్యంలో బద్వేలు నాలుగు రోడ్ల కూడలిలో బుధవారం భారీ రాస్తారోకో నిర్వహించారు. జాతీయ రహదారిపై ఆందోళనకారులు బైఠాయించి నిరసన తెలపడంతో.. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. బ్రహ్మసాగర్‌కు ప్రతీ రోజూ 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని, బ్రహ్మసాగర్ ప్రాజెక్టులో 15 టిఎంసి ల నీటిని నిల్వ చేయాలని డిమాండ్ చేశారు.

### బీజేపీలోకి వెళ్లాలనుకుంటే..

# ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసివెళ్తా

**- సాంకేతికంగా వచ్చేనాలుగేళ్లు నేను కాంగ్రెస్ ఎమ్మెల్యేనే**

**- కుంతియా, ఉత్తమ్‌లున్నంతవరకు కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదు**

**కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెం బర్19 (ఆర్ఎన్ఎ) : బీజేపీలోకి వెళ్లాలనుకుంటే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్తానని, కానీ సాంకేతికంగా వచ్చే నాలుగేళ్లు తాను కాంగ్రెస్ ఎమ్మెల్యేనేనని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. తెలంగాణలో బీజేపీ బలపడుతోందనేది తన వ్యక్తిగత అభిప్రాయమని చెప్పారు. రాష్ట్రంలో వేగంగా బీజేపీ అడుగులు వేస్తుందని, రాబోయేకాలంలో బలపడే అవకాశాలు కనిపిసున్నాయని అన్నారు. కేసీఆర్ సాధు జంతువు లాంటి కాంగ్రెస్‌ను చంపి.. పులి లాంటి బీజేపీని బలపర్చారన్నారు. ఇప్పుడు ఆ పులే టీఆర్ఎస్‌ను మింగే స్థాయిలోకి వస్తుందని అన్నారు. 12 మంది ఎమ్మెల్యేలు పార్టీ వీడాక తెలంగాణలో కాంగ్రెస్ పని ఖతమైందని వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కుంతియా ఉన్నంతవరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు భవిష్యత్ లేదని తీవ్రస్థాయిలో విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓడిపోతే గడ్డం తీసేస్తానన్న ఉత్తమ్... ఓడిపోయాక కూడా గడ్డంతోనే తిరుగుతున్నారని అన్నారు. జనం ఎలా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ గెలుపోటములు ఉత్తమ్‌పై ఆధారపడి ఉన్నాయన్నారు. డిండి ప్రాజెక్టు భూసేకరణ నిధుల కోసం మంత్రి హరీశ్‌రావును కలిశానన్నారు. కాలేజీ రోజుల నుంచే హరీశ్‌రావు తనకు మంచి మిత్రుడని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆ పరిచయంతోనే హరీష్‌రావును కలిశానని, దానికి మరే కారణం లేదని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కేసీఆర్‌కు మాత్రం రాజకీయాలే ముఖ్యం, గెలుపే ముఖ్యం అన్నట్లు ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వారే సరియైన సమాధానం చెబుతారని హెచ్చరించారు.

# టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి సన్మానం

**అభినందించిన మలిపెద్ది శంకర్**

హైదరాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మనుగా వైవి సుబ్బారెడ్డిని నియమించడం, ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ రాష్ట్రానికి టిటిడి బోర్డు పదవుల్లో సముచిత న్యాయం కల్పించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలని అవోపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మల్లిపెద్ది శంకర్ కొనియాడారు. టిటిడి బోర్డు చైర్మన్ వై వి సుబ్బారెడ్డిని మల్లిపెద్ది శంకర్ ప్రత్యేకంగా కలుసుకొని ఆయనను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కడవ జిల్లా ప్రొద్దుటూరు ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్య సోదరులు చిప్పగిరి ప్రసాద్‌కు టిటిడి బోర్డు సభ్యులుగా నామినేట్ చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. చాలా కాలం తర్వాత ఆర్య వైశ్యులకు కూడా సముచిత స్థానం లభించిందని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎనిమిది మంది బోర్డు సభ్యులను ఎంపిక చేస్తే దానికి ఏ మాత్రం తీసిపోకుండా తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వారిని కూడా 7 మందిని టిటిడి బోర్డు సభ్యులుగా నామినేట్ చేయడం గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి మంచి నిర్ణయం తీసుకొని రెండు తెలుగు రాష్ట్రాల మధ్య, భక్తుల మధ్య సయోధ్య కుదిరేలా నిర్ణయం తీసుకోవడం విశేషం అన్నారు. ఆర్యవైశ్యుల తరఫున అవోపా తరఫున ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.




టిటిడి బోర్డు చైర్మన్ వై వి సుబ్బారెడ్డిని మల్లిపెద్ది శంకర్ ప్రత్యేకంగా కలుసుకొని ఆయనను శాలువ, పూలమాలతో ఘనంగా సన్మానించిన దృశ్యం.

# భగ్గుమన్న పెట్రో ధరలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): పెట్రో ఉత్పత్తుల ధరలు బుధవారం భారీగా పెరిగాయి. బ్జడెట్ అనంతరం ఒకేరోజు ఈస్థాయిలో పెట్రో ధరలు పెరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమనడంతో పాటు సౌదీ చమురు క్షేత్రాలపై డ్రోన్ దాడుల నేపథ్యంలో పెట్రో ధరలు పేట్రేగిపోతున్నాయి. బుధవారం లీటర్ పెట్రోల్ ధర రూ 25 పైసలు పెరగ్గా, డీజిల్ ధర లీటర్‌కు 24 పైసల మేర పెరిగింది. పెట్రో ధరల పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ రూ 72.42 కాగా, హైదరాబాద్‌లో రూ 76.99 ముంబైలో రూ 75.26, చెన్నైలో రూ 69.57, కోల్‌కతాలో రూ 68.23 పలికింది.

# చంద్రబాబు శవరాజకీయాలతు చూడలేకపోయా

**-అందుకే టిడిపిని వీడుతున్నా: అన్నపురెడ్డి నర్సిరెడ్డి**

అమరావతి,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): చంద్రబాబు శవ రాజకీయం నేను చూడలేక పోయా.. అందుకే టీడీపీకి రాజీనామా చేస్తున్నానని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అన్నపురెడ్డి నర్సిరెడ్డి అన్నారు. మాజీ స్పీకర్ కోడెల శివ ప్రసాద్ మృతి చెందిన సమయం నుంచి కోడెల మృతి చెందారన్న దానికంటే కూడా వైసీపీ ప్రభుత్వంపై నిందలు వేయాలన్న తపనే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖంలో ప్రజలు చూస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన మానసిక శోభ వల్లే కోడెల శివప్రసాద్ ఆత్మహత్య చేసుకున్నారని చంద్రబాబు నాయుడు నీచంగా శవరాజికీయం చేస్తున్నారని అన్నారు. అయితే ఆ శవరాజికీయం ప్రజలే కాదు ఆ పార్టీ నేత కూడా చూడలేక పోయాడు. అందుకే పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చానని అన్నాడు. తెలుగు దేశం పార్టీకి రాజీనామా చేసిన సందర్భంగా నర్సిరెడ్డి మీడియాతో సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలోనే నర్సిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు కోడెల మరణం గురించి మీడియాలో మాట్లాడిన అసత్య మాటలకు మనస్థాపం చెంది టీడీపీకి రాజీనామా చేస్తున్నానని అయన తెలిపారు. కోడెల గగురించి సంతాప మాటలు మాట్లాడాల్సిన పరిస్థితి పక్కన పెట్టి సవరాజికీయం చేస్తున్నారని దారుణమన్నారు. కోడెల మరణానికి కారణం అయన కుటుంబసభ్యులు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని చెయ్యకూడని నీచమైన పనులు అన్ని కొడుకు, కూతురు చేశారని ఈ విషయం అందరికి తెలిసిందే అని అయన అన్నారు. అక్రమంగా సంపాదించిన ఆస్తి విషయంలో కోడుకు, కూతురు గొడవలు పడిన విషయం అందరికి తెలిసిందే అని, ఎన్నో అరాచకాలు చేసిన కుటుంబాన్ని వక్కన చంద్రబాబు చేసే శవరాజకీయాన్ని చూడలేక టీడీవీకి రాజీనావా చేశా అని అయన వ్యాఖ్యానించారు.

# 'వాల్మీకి' సినిమా పేరు మార్చాలన్న కన్నా

విజయవాడ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): వాల్మీకి సినిమా టైటిల్‌పై ఈ మధ్య అభ్యంతరాలు వ్యక్తమవుతోన్నాయి. హైకోర్టులో కేసులు కూడా వేశారు. సినిమా టైటిల్ మర్చాలని.. ఇదివరకే పలువరు గొడవ చేయగా.. ఇప్పుడు ఈ సినిమాపై బీజేపీ అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ స్పందించడం వివాదాస్పదంగా మారింది. వాల్మీకి సినిమా టైటిల్‌తో కొందరి మనోభావాలు దెబ్బతింటున్నాయని.. వెంటనే పేరు మార్చాలని కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. కొణిదెల వరుణ్ తేజ్ హీరోగా.. పూజా హెగ్డే హీరోయిన్‌గా ఈ సినిమా తెరకెక్కింది. ఈసినిమాకి హరీష్ శంకర్ దర్శకత్వం వహించారు. తమిళ్ సినిమా 'జిగర్తాండ'ను తెలుగులో రిమేక్ చేశారు. ఇప్పటికే రిలీజ్ అయిన ఈ సినిమా ట్రైలర్, సాంగ్స్ ఇన్‌ట్రెస్టింగ్‌గా ఉన్నాయి. ఈ సినిమాలో వరుణ్ తేజ్ నట విశ్వరూపం చూపించాడు. ఈ నెల 20న ఈ సినిమా విడుదల కానుంది.

# నంద్యాలను ముంచెత్తిన వరద

**నీటిలో కొట్టుకు వచ్చిన మొసలి**

కర్నూలు,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): నంద్యాల పట్టణాన్ని వరద ముంచెత్తింది. భారీ వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. వరద నీటిలో కొట్టుకువచ్చిన ఓ మొసలి స్థానిక కరెంటు ఆఫీస్ వద్ద హల్‌చల్ చేసింది. భారీ వరదలకు మొసలి కాలనీలోకి వచ్చింది. జనావాసాల్లోకి మొసలి రావడంతో స్థానికులు హడలెత్తిపోయారు. వెంటనే అటవీశాఖ అధికారలుకు సమాచారం అందించారు. మొసలిని నిర్బంధించేందుకు స్థానికులు ప్రయత్నించారు. వరదల కారణంగా పాములు కూడా ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# ఓ మహిళ దురాగతం

## ప్రియుడి భార్యాపిల్లల హత్య

అమృత్‌సర్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ప్రియురాలు ప్రియుడి భార్యను, కూతురిని హత్య చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. రామ్ తిరేత్ కు కమలేష్ అనే భార్య ఉంది. ఐటిబిపి జవాన్ దేవానంద్‌తో కమలేష్ వివాహేతర సంబంధం పెట్టుకుంది. వీళ్ల వివాహేతర సంబంధానికి దేవానంద్ కుటుంబం అడ్డువస్తుండడంతో అంతం చేయాలని కమలేష్ నిర్ణయం తీసుకుంది. దేవానంద్ భార్య సుమన్, కూతురు క్రియా గొంతు పిసికి చంపేసింది. అనంతరం వాళ్ల మృతదేహాలను ప్రితా నగర్‌లో ఉన్న కుంటలో పడేసింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను బయటకు తీసి శవ పరీక్ష నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దేవానంద్ కుటుంబానికి సన్నిహితంగా ఉండే కమలేష్ పై పోలీసులకు అనుమానం వచ్చింది. పోలీసులు తనదైన శైలిలో విచారణ జరపడంతో తాను హత్య చేశానని కమలేష్ ఒప్పుకుంది. దీంతో పోలీసులు ఆమెతో పాటు దేవానంద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## మానవ అక్రమరవాణాపై
# ఉక్కుపాదం మోపాలి

**- ఎన్జీవోలతో కలిసి పోలీసులు ముందుకెళ్లాలి**
**- అక్రమ సంపాదన, ఆర్థిక మూలలపై దెబ్బకొట్టాలి**
**- అప్పుడే ఈ వ్యవస్థకు అడ్డుకట్ట వేయగలం**
**- తెలంగాణ డీజీపీ మహేందర్ రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్19 (ఆర్ఎన్శ్రీ) : మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని డీజీపీ మహేందర్ రెడ్డి పోలీసులకు సూచించారు. బుధవారం మానవ అక్రమ రవాణాపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రాష్ట్రస్థాయి సదస్సును ప్రారంభించారు. ఈ సదస్సులో అక్రమ రవాణాను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా డీజీపీ మహేందర్రెడ్డి మాట్లాడుతూ.. సహాయం చేస్తామని చెప్పి మభ్యపెట్టి హ్యూమన్ ట్రాఫికింగ్కు పాల్పడుతున్నారని, బాధితులను రక్షించడంలో ఎన్జీఓలతో కలిసి ముందుకు వెళ్లాలని పోలీసులకు సూచించారు. మానవ అక్రమ రవాణా ఎలా చేస్తున్నారు. ఎక్కడ చేస్తున్నారు.. అనే అంశాన్ని పోలీసులు ముందుగానే గుర్తించి ఇలాంటివి జరగకుండా చూడాలని, అప్పుడే చేస్తున్న ఉద్యోగానికి న్యాయం చేసిన వారవుతామని డీజీపీ పేర్కొన్నారు. బాధితులను రక్షించడం, పునరావాసం కల్పించడం, ప్రాసిక్యూషన్ వంటి విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలని డీజీపీ సూచించారు. మానవ అక్రమ రవాణాలో బాధితులు ఖండాతరాలు దాటి వస్తున్నారని, నిందితులకు శిక్షపడేలా ప్రాసిక్యూషన్ జరగాలని అన్నారు. అక్రమ సంపాదన కోసమే వ్యభిచారానికి అలవాటు పడుతున్నారని, కాబట్టి అక్రమ సంపాదన, ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టినప్పుడే ఈ వ్యవస్థ ఆగుతోందని ఆయన తెలిపారు. అనంతరం ఐజీ స్వాతిలక్రా మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, హ్యూమన్ ట్రాఫికింగ్పై సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. దీనిపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టామని, నిందితులకు న్యాయస్థానాల్లో శిక్ష పడేలా చూస్తున్నామని తెలిపారు. చిన్నారులను వెట్టి చాకరీ చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటూ, ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ పేరుతో చాలా మంది చిన్నారులను రక్షిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ప్రజ్వల ఫౌండేషన్ స్థాపకులు సునీత కృష్ణన్ మాట్లాడుతూ.. ముంబైలో అక్రమ రవాణా నుంచి 112 మంది అమ్మాయిలని రక్షిస్తే అందులో ఆరుగురు తెలుగు అమ్మాయిలు ఉన్నారని పేర్కొన్నారు. 25 ఏళ్ల క్రితం ఈ స్వచ్ఛంద సంస్థను నగరంలో ప్రారంభించారని, దేశంలో ఎక్కడ అత్యాచార ఘటనలు జరిగినా భయమేసేదని అన్నారు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో మానవ అక్రమ రవాణాను తగ్గిందని తెలిపారు. కొన్ని రోజుల క్రితం 16 ఏళ్ల బాలిక ఫేస్బుక్ ద్వారా బంగ్లాదేశ్ నుంచి హైదరాబాద్కు ట్రాఫికింగ్ అయిందని, ప్రస్తుతం టెక్నాలజీతో ట్రఫికింగ్ జరుగుతుందన్నారు. తెలంగాణలో జీరో ట్రాఫికింగ్ దిశగా మార్పు రావాలని కోరుకుంటున్నట్లు ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పోలీసు ఉన్నతాధికారులు హాజరైయ్యారు.

## చిదంబరంతో
## కాంగ్రెస్ నేతల భేటీ

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 (ఆంఎన్ఎ): ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో అరెస్టయి తీహార్ జైల్లో ఉన్న కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరాన్ని కాంగ్రెస్ సీనియర్ నేతలు గులాం నబీ ఆజాద్, అహ్మద్ పటేల్ బుధవారం కలిశారు. వారి వెంట చిదంబరం కుమారుడు కార్తీ కూడా ఉన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కశ్మీర్ అంశం, ఆర్థిక మాంద్యం తదితర విషయాలపై దాదాపు అరగంట పాటు వీరు చర్చించినట్లు సమాచారం. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో గత నెల 21న సీబీఐ అధికారులు చిదంబరాన్ని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అనంతరం కోర్టులో హాజరువర్చగా.. జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించింది. దీంతో సెప్టెంబరు 5 నుంచి ఆయన తీహార్ జైల్లో ఉంటున్నారు. ఈ కేసులో బెయిల్ కోసం చిదంబరం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై ఈ నెల 23న విచారణ జరగనుంది. మరోవైపు ఆయన జ్యుడీషియల్ కస్టడీ నేతో ముగియనుంది.

# పాక్ను ఎక్కడుంచాలో మోదీ అక్కడ ఉంచారు

**- 370అధికరణ రద్దుపై రాహుల్ తనవైఖరిని స్పష్టం చేయాలి**
**- కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్షా**

జార్ఖండ్, సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ) : జమ్మూకశ్మీర్కు ప్రత్యేక హోదా కల్పించే 370, 35ఏ అధికరణలను రద్దు చేయడం ద్వారా ప్రధాని మోదీ పాకిస్థాన్ను ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచారని, భారత్లో కశ్మీర్ అంతర్భాగమని కుండబద్ధలు కొట్టినట్టు చెప్పారని కేంద్ర హోం మంత్రి అమిత్షా అన్నారు. 370 అధికరణకు సంబంధించి కేంద్రం తీసుకున్న నిర్ణయంపై తన వైఖరి ఏమిటో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పష్టత ఇవ్వాలని అన్నారు. జార్ఖండ్లోని జంతరలో బుధవా డు నిర్వహించిన జోహర్ జన్ ఆశీర్వాద్ యాత్రలో అమిత్షా మాట్లాడుతూ, మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా రాష్ట్రాల్లో రాహుల్ పర్యటించేటప్పుడైనా 370 అధికరణపై తన వైఖరి ఏమిటో ప్రజలకు చెబితే బాగుంటుందని అన్నారు. తాము సర్జికల్ దాడులు జరిపినప్పుడు రాహుల్ వ్యతిరేకించారని, వాయిదాడులు జరిపితే సాక్ష్యాలు అడిగారని, దేశాన్ని ఏ దిశగా నడపాలని ఆయన అనుకుంటున్నారో ప్రజలకు ఇప్పుడైనా వివరణ ఇవ్వాలని అమిత్షా నిలదీశారు. పవిత్రమైన సంథాల్ పరగణ నుంచి తాము ప్రారంభించిన జన అశీర్వాద యాత్ర రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ సాధించే దిశగా తమను తీసుకెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా తాము రాష్ట్రాన్ని సమూలంగా అభివృద్ధి దిశగా మార్చివేశామని అన్నారు

# ఈ-సిగరెట్లపై బ్యాన్

**- ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొనే ఈనిర్ణయం**
**- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి సీతారామన్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్19(ఆంఎన్ఎ) : ఈ-సిగరెట్లపై నిషేధం విధిస్తూ బుధవారం కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ఈ-సిగరెట్లకు సంబంధించిన ఉత్పత్తి, తయారీ, దిగుమతి, ఎగుమతి, రవాణా, అమ్మకం, పంపిణీ, నిల్వ, ఈ సిగరెట్లకు సంబంధించిన ప్రకటనలు అన్నీ బ్యాన్ చేసినట్లు ఆమె తెలిపారు. పొగాకు సంబంధిత అనారోగ్యాల కారణంగా దేశంలో ప్రతి సంవత్సరం 9లక్షల మందికి పైగా మరణిస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించి ముందస్తు చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నామని ఆర్థిక మంత్రి చెప్పారు. పార్లమెంటు తదుపరి సమావేశాల్లో దీనిపై ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. లక్షల జరిమానా, ఏడాదిపాటు జైలుశిక్ష, రెండవ సారి ఉల్లంఘిస్తే రూ.5లక్షల జరిమానా, మూడేళ్ల పాటు జైలుశిక్ష విధించటం జరుగుతుందని ఆమె తెలిపారు. అదేవిధంగా సాధారణ సిగరేట్లను పబ్లిక్ ప్లేస్లలో సిగరేట్ తాగితే మొదటిసారి రూ.2వేలు, తరువాత ఫైన్ పెంచడంతో పాటు జైలు శిక్ష వేయటం జరుగుతుందని ఆమె తెలిపారు. భారతదేశంలో లైసెన్స్ లేని ఇ-సిగరెట్లు పొగాకును కాల్చవని, కానీ వినియోగదారు పీల్చే ద్రవ నికోటిన్ను ఆవిరి చేయడానికి తాపన మూలకాన్ని ఉపయోగిస్తాయి. అదే మండే సిగరెట్ నుండి దీన్ని వేరు చేస్తుంది. భారతదేశంలో 106 మిలియన్ల పెద్దలు ధూమపానం చేస్తూ మొదటిస్థానంలో ఉండగా, ప్రపంచంలో చైనా రెండవ స్థానంలో ఉంది.

## తోట త్రిమూర్తులు ఎప్పటికీ నా శత్రువే
**-మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్**

కాకినాడ,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): ఇటీవలే వైకాపాలో చేరిన మాజీ ఎమ్మెల్యేపైతోట త్రిమూర్తులుపై ఏపీ డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్చంద్రబోస్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన ఎప్పటికైనా తనకు శత్రువేనని అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ పార్టీలోకి ఎందరో వస్తుంటారు... పోతుంటారని అన్నారు. వెంకటాయపాలెం శిరోముండనం కేసులో.. వైసీపీ ప్రభుత్వం దళితుల పక్షాన ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. వైసీపీకి దళితులు అండగా ఉన్నారని, వారిని తాము వదులుకునే ప్రసక్తేలేదన్నారు. కేసులో ఏదైనా తేడా జరిగితే బాధితులను నేరుగా సీఎం దగ్గరికి తీసుకెళ్తానని, అవసరమైతే దళితులతో కలిసి ధర్నా చేసేందుకైనా తాను సిద్ధమని పిల్లి సుభాష్చంద్రబోస్ స్పష్టం చేశారు.

# పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ ఏదీ?

**- కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 19(ఆర్ఎన్ఎ) : పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కల్పించలేకపోతున్నారని కేంద్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరు పని చేస్తున్న ప్రదేశాలను గ్యాస్ చాంబర్లతో పోల్చింది. కేంద్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్ కే కే వేణుగోపాల్ను ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. దేశంలోనూ మరణించేందుకు ప్రజలను గ్యాస్ ఛాంబర్లలోకి పంపించరని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. మన దేశంలో నెలకు దాదాపు నలుగురైదుగురు పారిశుద్ధ్య కార్మికులు మరణిస్తున్నారని పేర్కొంది. మురుగు కాలువలు, మ్యాన్హోల్స్ను కాయకష్టంతో శుభ్రం చేసేవారికి రక్షణ కల్పించేందుకు ఆక్సిజన్ సిలిండర్లు, మాస్కులు వంటివాటిని ఎందుకు అందజేయడం లేదని జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు పూర్తయినప్పటికీ, కుల వివక్ష ఇప్పటికీ కొనసాగుతోందని సీతారామన్ ఆవేదన వ్యక్తం చేసింది. మానవులంతా సమానమేనని, వారికి సమాన సదుపాయాలను అధికారులు కల్పించడం లేదని పేర్కొంది. మాన్యువల్ స్కావెంజర్స్ను నియమించుకోవడంపై 1993లో నిషేధం విధించారు. కాయకష్టంతో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేవారి పునరావాసం కోసం 2013లో చట్టాన్ని ఆమోదించారు. అయినప్పటికీ దేశంలో మాన్యువల్ స్కావెంజింగ్ కొనసాగుతోంది.

# టెక్నాలజీ వినియోగంతో ముందుకుసాగాలి

**-కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్రెడ్డి**

కరీంనగర్, సెప్టెంబర్ 19(నేటినిజం ప్రతినిధి):పోలీసులు టెక్నాలజీ వినియోగంతో ముందుకుసాగాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్రెడ్డి అన్నారు. టెక్నాలజీ వినియోగంలో వస్తున్న మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు.

కమీషనరేట్ కేంద్రంలో బుధవారం నాడు నేరసమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ విబి కమలాసన్రెడ్డి మాట్లాడుతూ పోలీస్స్టేషన్లలో రికార్డుల నిర్వాహణ సక్రమంగా కొనసాగిస్తూ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్చేయాలన్నారు. అక్రమ కార్యకలాపాలపై అనునిత్యం నిఘాఉంచి,నియంత్రించాలని ఆదేశించారు. వివిధ విభాగాలకు చెందిన పోలీసులతో ప్రతివారం సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. డ్రంక్అండ్డ్రైవ్, హైల్మెట్ వినియోగం, ఓవర్లోడ్, రాష్డ్రైవింగ్లపై దృష్టి కేంద్రీకరించాలని చెప్పారు. నేరాల ఛేదన,నియంత్రణకు దోహదపడే సిసి కెమెరాల ఏర్పాటులో అన్నివర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు. సిసి కెమెరాల పనితీరును పరిశీలించాలని చెప్పారు. ప్రారంభానికి సిద్దంగా ఉన్న సిసి కెమెరాలను ఈనెల 24న ప్రారంభించాలని తెలిపారు. 2018సంవత్సరానికి సంబంధించిన కేసులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. అనుమానితులను నిర్ధారించేందుకు ఫోర్టబుల్ ఫింగర్ప్రింట్ డివైజ్ను వినియోగించాలని పేర్కొన్నారు. యూనిఫారంలో ఉన్నప్పుడు ఎలాంటి వస్తువులను కొనుగోలుచేయవద్దని సూచించారు. యూనిఫారంలో ఉండి వస్తువులు కొనుగోలు చేయడం వల్ల కొన్నిరకాల ఆరోపణలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు.



**సమర్ధులకు రివార్డులు**

గతనెలలో సమర్ధవంతమైన సేవలందించిన వివిధ విభాగాలకు చెందిన పోలీసులకు బుధవారం పోలీస్ కమీషనర్ విబి కమలాసన్రెడ్డి రివార్డులను అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.

ఉత్తమ స్టేషన్హౌజ్ ఆఫీసర్గా తుల శ్రీనివాసరావు(కరీంనగర్ రూరల్), విధినిర్వాహణలో టాస్క్ఫోర్స్ ఇన్స్పెక్టర్ జనార్ధన్రెడ్డి, రిసెప్షన్ అధికారిణిగా వి రేణుక(కరీంనగర్ త్రీటౌన్), ఇన్వెస్టిగేషన్ అధికారులుగా కె రఘుపతిరెడ్డి(ఎల్యండి), ప్రవల్లిక(హుజురాబాద్), దామోదరచారి(కొత్తపల్లి),స్టేషన్ రైటర్గా ఏ శ్రీనివాస్(కరీంనగర్ రూరల్), అడ్మిన్ అధికారిగా పివి కరుణాకర్(హుజురాబాద్),బ్లూకోల్ట్స్ బి నతీష్, వి విజయేందర్(జమ్మికుంట), ఈ-చలాన్లలో ఎన్ రాజశేఖర్, యం అరుణ్, కె రమేష్(కరీంనగర్ ట్రాఫిక్), పాట్రోల్కార్ షంషోద్దీన్, సురేష్(కరీంనగర్ టూటౌన్), వారెంట్లు,సమన్లలో ఆర్ బిక్షపతి, యం క్రాంతికుమార్(హుజురాబాద్), సిటి స్పెషల్బ్రాంచి నుండి టి కృష్ణ, యం చంద్రశేఖర్, టాస్క్ఫోర్స్ నుండి మహేందర్రెడ్డి,రాజు, సిటి ఆర్మడ్ రిజర్వ్ విభాగం నుండి మల్లారెడ్డి, బాలరాజు, ఐలయ్య, హెూంగార్డ్ విభాగం నుండి రాజు, రహీం, షీటీమ్స్ నుండి జి మధుసూధన్రెడ్డి, వి శైలజ, క్రైంపార్టీ నుండి ఎస్ శ్రీనివాస్, టి సురేంద్రపాల్, సిడివోగా కనుకయ్యలు రివార్డులను అందుకున్నారు.

ఈ సమావేశంలో ఏసిపిలు ఉషారాణి, శోభన్కుమార్, అశోక్, కృపాకర్, శ్రీనివాస్, రాగ్యానాయక్ లతోపాటుగా పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# నిటిఅయోగ్ చెప్పినా ...నిధులివ్వని కేంద్రం

**- ఆర్థిక మంత్రి హరీష్ రావు**

హైదరాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): మిషన్ కాకతీయ పథకానికి రాష్ట్రానికి రూ.5000 కోట్లు సాయం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిటిఅయోగ్ సూచించినప్పటికీ ఇవ్వలేదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి టి.హరీష్ రావు తెలిపారు. శాసనసభలో బుధవారం స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి, బాల్క సుమన్, క్రాంతి కిరణ్ మిషన్ కాకతీయ పథకంపై అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమం కింద 21,275 చెరువులను పునరుద్ధరించి 14.15 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించామన్నారు. నిటిఅయోగ్ 2017 ఆగస్టులో నివేదికలో నీటి నిర్వహణలో ఎంపిక చేసిన ఉత్తమ విధానాలకు గాను మిషన్ కాకతీయ ప్రయోజనాలను ప్రస్తావించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు, పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచినా కేంద్రం నిధులు ఇవ్వలేదన్నారు.

### సచివాలయం డిజైన్ ఫైనల్ చేయలేదు - మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

ఎంఐఎం సభ్యులు మహ్మద్ మోజామ్ ఖాన్ తదితరులు, సచివాలయంలో ఉన్న మతసంబంధ కట్టడాలకు ఇబ్బంది కలగకుండా నూతన సచివాలయ భవన నిర్మాణం చేపడతామని హామి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, సాంకేతిక కమిటీ సమర్పించిన నివేదికకు మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయలను జత చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించామని తెలిపారు. అయితే ప్రార్ధనామందిరాలను కదలచబోమని, నూతన సచివాలయం నిర్మాణం అయ్యేంత వరకు

యధావిధిగా భక్తుల రాకకు అనుమతిస్తామని హామీ ఇవ్వాలని పలువార్లు కోరగా మంత్రి బదులిస్తూ, సచివాలయం డిజైన్ పూర్తి కాలేదని, అంచనా వ్యయం ఇప్పుడే చెప్పలేమని, సభ్యుల డిమాండ్ ను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు.

### నిధుల కొరత ఉంటే ప్రయివేటు పాలిటెక్నిక్ ల ఏర్పాటు....మంత్రి నిరంజన్ రెడ్డి

రాష్ట్రంలో ప్రయివేటు పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటును పరిశీలిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. సభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డి, జాజుల సురేందర్, దాసరి మనోహర్ రెడ్డి వ్యవసాయ శాఖ బలోపేతంపై ప్రశ్నించారు. గండ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ కోర్సులకు డిమాండ్ ఉన్నప్పటికీ తగినన్ని కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారన్నారు. అలాగే ఉద్యానవన శాఖలో సిబ్బంది కొరత ఉందన్నారు. మంత్రి సమాధానమిస్తూ ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తామని, నిధులు కొరత ఉంటే ప్రయివేటు పరిశీలిస్తామన్నారు. ఉద్యానవన శాఖలో సిబ్బందిని హేతుబద్దీకరిస్తున్నామని తెలిపారు.

### చెట్లు ఆగమైతే జరిమానా గ్రామ సభలే నిర్ణయిస్తాయి - మంత్రి ఎర్రబెల్లి

గ్రామంలో ఎన్ని చెట్లు నాటాలనే లక్ష్యాలేవి నిర్దేశించలేదని, అయితే చెట్లు ఆగమైతే జరిమానాలు గ్రామసభలే నిర్ణయిస్తాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు. గ్రామాల్లో 30 రోజుల కార్యక్రమం అమలపై సభ్యులు సోలిపేట రామలింగారెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, ఆరూరి రమేష్ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ, నాటిన చెట్లలో 85 శాతం బతికించుకోవాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

### సబ్ కాంట్రాక్టర్లతో ఇబ్బందులు...ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

జిహెచ్ఎంసీ పరిధిలో ఏరాటు చేసిన ఎల్ఈడీ బల్బుల నిర్వహణ సంస్థ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించిందని, దీంట్లో ఇబ్బందులున్నాయని సభ్యులు కాలేరు వెంకటేష్ తెలిపారు. కాంట్రాక్టర్ కు, సబ్ కాంట్రాక్టర్ కు మధ్య సమన్వయ లోపంతో వారాల తరబడి మరమ్మతులు జరగడం లేదన్నారు. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, సమన్వయ సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ,రాష్ట్రంలో 1,17,714 ఖాళీలు భర్తీ రాష్ట్రంలో 1,17,714 ఖాళీలను భర్తీ చేసినట్టు ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు తెలిపారు. ప్రభుత్వ శాఖలలో ఖాళీల భర్తీపై సభ్యులు బాల్కసుమన్ అడిగిన ప్రశ్నకు, టీఎస్పీఎస్సీ 101 ప్రకటనలను, ఇతర నియామక ఏజెన్సీలు 41 ప్రకటనలను జారీ చేశాయని తెలిపారు. 31,668 ఖాళీల నియామక పక్రియ పురోగతిలో ఉందన్నారు. వివిధ నియామకాల పక్రియపై 900 వరకు కేసులు న్యాయస్థానాల్లో ఉన్నాయన్నారు. కొన్ని అప్పీల్ దశలో ఉండగా, మరికొన్ని స్టేలో ఉన్నాయని తెలిపారు. వీటి పరిష్కారానికి గట్టి ప్రయత్నాలు జరుగుతున్నారు

### బిల్ట్ ఫ్యాక్టరీ మూతపడి ఐదేండ్లు : సీతక్క

హైదరాబాద్,సెప్టెంబర్ 19 (ఆర్ఎన్ఎ): ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిల్ట్ ఫ్యాక్టరీ మూతపడి ఐదేండ్లు కావస్తున్నదని, దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడ్డ 10 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయని కాంగ్రెస్ సభ్యురాలు అనసూయ (సీతక్క) అన్నారు. బుధవారం శాసనసభలో జీరో అవర్లో ఆమె మాట్లాడారు. రూ.327 కోట్లతో ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని హామి ఇచ్చినా అమలు చేయలేదన్నారు. కార్మికులకు 48 నెలల వేతనం, పదవీ విరమణ పొందిన వారికి బెనిఫిట్స్ యాజమాన్యం ఇవ్వడం లేదన్నారు. ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్ సమాధానమిస్తూ, సీఎం కేసీఆర్ ఐటీసీతో చర్చించారని, ఫ్యాక్టరీ పునరుద్ధరణకు పూర్తి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని తెలిపారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ నిమ్జ్ కోసం మొదటి విడతగా 3500 ఎకరాలు సేకరించారని, వెంటనే నిమ్జ్ ఏర్పాటుకు చర్యలు చేపడితే స్థానికులకు ఉపాధి లబిస్తుందన్నారు. సభ్యులు రాథోడ్ బాబురావ్ మాట్లాడుతూ, ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలకో 10 నెలల వేతనం బకాయి ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సభ్యులు జైపాల్ యాదవ్ మాట్లాడుతూ, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ లో భాగంగా చేపట్టిన డీ28 పనులను పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వేలాది ఎకరాలకు సాగునీరు రాక ఆగిపోయిందన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. రామగుండం శాసనసభ్యులు కోరుగంటి చందర్ మాట్లాడుతూ, రామగుండం పెర్టిలైజర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆర్ఎఫ్సీఎల్) లో రాష్ట్ర ప్రభుత్వ వాటా 11 శాతం ఉందని, నీళ్లిస్తున్నామని, రోడ్లు వేశామని, అయినా స్థానికులకు అవకాశమివ్వడం లేదన్నారు.

# భారీ వర్షాలకు అవకాశం

**-కేంద్ర వాతావరణ శాఖహెచ్చరిక**

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 (ఆంఎన్ఎ): రానున్న 48 గంటల్లో ఏడు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయంటోంది కేంద్ర వాతావరణ శాఖ. తెలంగాణ, ఆంధ్రాతో పాటు విదర్భ, గోవా, కర్ణాటక, తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్, అండమాన్ నికోబార్ దీవుల్లో భారీవర్షాలు కురుస్తాయని తెలిపింది. ఒడిశా, అండమాన్ నికోబార్ దీవుల్లోని సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని అధికారులు హెచ్చరించారు. రాగల వారం రోజుల పాటు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని కోరారు. బీహార్, ఉత్తర్ ప్రదేశ్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పాట్నాలో లోతట్టు ప్రాంతాలు జలమలమయ్యాయి. కొన్ని కాలనీల్లోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యూపీలోని ప్రయాగ్ రాజ్ లోనూ భారీ వర్షం కురిసింది. రహదారులు చెరువులుగా మారిపోయాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రవాణాకు అంతరాయం కల్గుతోంది. గంగా నదిలో వాటర్ లెవల్ పెరగడంతో .. తీరంలోని షాపుల్లోకి నీరు చేరింది. హైదరాబాద్ నగరంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 9 గంటలకు మొదలైన వాన అర్ధరాత్రి దాకా ఉరుములు మెరుపులతో కుండపోత పోసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పగలంతా తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిన నగరవాసులు వర్షంతో సేద తీరారు. భారీ వర్షం కారణంగా పలుచోట్ల రోడ్లపై నీళ్ళు నిలిచాయి. లోతట్టు ప్రాంతాలు జలమయయ్యాయి. బల్దియా మాన్?సూన్? ఎమ్జ్గం÷న్సీ టీంలు రంగంలోకి దిగి రోడ్లపై నీళ్లు నిల్వకుండా చర్యలు తీసుకున్నాయి.

అల్వాల్, బోయిన్పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, కుషాయిగూడ, చర్లపల్లి, నాచారం, మల్కాజిగిరి, నేరెడ్మెట్, జవహర్నగర్, దమ్మాయిగూడ, ఎల్బీనగర్, మాదాపూర్, గచ్చిబౌలి, సికింద్రాబాద్, పాతబస్తీతో పాటు పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. విషయం తెలుసుకున్న మేయర్ రామ్మోహన్.. వర్షం వల్ల ఎక్కడైనా సహాయక చర్యలు అవసరమైన పక్షంలో సేవలందించేందుకు రెడీగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ముషీరాబాద్ పరిధిలోని అడిక్మెట్ పద్మా కాలనీ, పెద్దమ్మ టెంపుల్ తదితర ప్రాంతాల్లో వర్షం నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాయి.

క్రీడలు

# కోహ్లి గొప్ప ఆటగాడు: ఆఫ్రిది





మొహాలీ: భారత్ కెప్టెన్ విరాట్ కోహ్లి గొప్ప ఆటగాడని పాకిస్తాన్ మాజీ కెప్టెన్ షాహిద్ ఆఫ్రిది అన్నాడు. నిన్న దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ-20లో విరాట్ అర్ధసెంచరీ(72)తో ఇండియాను గెలిపించిన విషయం తెలిసిందే. ఈ ఇన్నింగ్స్‌తో విరాట్ టీ-20 ఫార్మాట్‌లో 50+ సగటును నమోదు చేశాడు. ఇంతకు ముందే వన్డేల్లో(60.31), టెస్టుల్లో(53.14) యాభైకి పైగా సగటును కలిగియున్నాడు. ఈ మ్యాచ్‌తో టీ-20ల్లో సైతం 50+ సగటు నమోదు చేసి కొత్త రికార్డు సృష్టించాడు. అన్ని ఫార్మాట్స్‌లో యాభైకి పైగా సగటు(యావరేజి) నమోదు చేసిన ఏకైక క్రికెటర్ కోహ్లి అని ఐసీసీ ట్విట్టర్ ద్వారా ప్రశంసించిన విషయం విదితమే.

ఈ ట్వీట్‌ని రీట్వీట్ చేసిన ఆఫ్రిది.. కోహ్లి నీకు శుభాకాంక్షలు తెలుపుతున్నాను. నువ్వు గొప్ప ఆటగాడివి, నీ సక్సెస్‌ను ఇలాగే కొనసాగించు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులను ఇలాగే అలరించాలని ట్విట్టర్‌లో పేర్కొన్నాడు.

కాగా, ఈ మ్యాచ్‌తో కోహ్లి టీ-20ల్లో అత్యధిక పరుగులు(2,441పరుగులు) సాధించిన ఆటగాడిగా రోహిత్ శర్మ రికార్డు బద్దలు కొట్టాడు. అట్లాగే టీ20ల్లో అత్యధిక అర్ధసెంచరీలు(22) సాధించిన ఆటగాడిగానూ రికార్డు సృష్టించాడు. ఈ మ్యాచ్‌తో ఇండియా మూడు మ్యాచ్‌ల టీ-20 సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉంది. మొదటి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. మూడో మ్యాచ్ 22న బెంగళూరులో జరుగనుంది.

# విరాట్ విజయం



మొహాలీ: వరుణుడి కారణంగా ధర్మశాల మ్యాచ్ రద్దయిందని నిరాశలో ఉన్న అభిమానులకు మొహాలీ మ్యాచ్ అసలు సిసలైన మజా అందించింది. బుధవారం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మూడు మ్యాచ్ ల సిరీస్‌లో కోహ్లీసేన 1-0తో ముందడుగు వేసింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 150 పరుగుల లక్ష్యాన్ని భారత్ మరో ఓవర్ మిగిలుండగానే 3 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. కెప్టెన్ విరాట్ కోహ్లి(52 బంతుల్లో 72 నాటౌట్, 4ఫోర్లు, 3సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో కదంతొక్కాడు. ఫెల్కువాయో(1/20), శంసీ(1/19), ఫోర్టిన్ (1/32) ఒక్కో వికెట్ తీశారు. తొలుత డికాక్ (37 బంతుల్లో 52, 8ఫోర్లు), బవుమా(43 బంతుల్లో 49, 3ఫోర్లు, సిక్స్) రాణింపుతో దక్షిణాఫ్రికా నిర్ణీత 20 ఓవర్లలో 149/5 స్కోరు చేసింది. దీపక్ చాహర్(2/22)కు రెండు వికెట్లు దక్కగా, సైనీ(1/34), జడేజా(1/31), హార్దిక్(1/31) ఒక్కో వికెట్ తీశారు. అర్ధసెంచరీతో జట్టుకు విజయాన్ని కట్టబెట్టిన కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఆఖరిదైన మూడో మ్యాచ్ బెంగళూరులో ఈనెల 22న జరుగుతుంది.

విరాట్ వీరవిహారం:

సఫారీలు నిర్దేశించిన లక్ష్యఛేదనకు దిగిన భారత్‌కు..రోహిత్‌శర్మ(12) రూపంలో ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. రెండు భారీ సిక్స్‌లతో ఊపుమీద కనిపించిన హిట్‌మ్యాన్‌ను ఫెల్కువాయో వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన కోహ్లి..ధవన్(40)కు జతకలిశాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔట్ నుంచి బయటపడ్డ కోహ్లి ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు.

ధవన్ సహకారంతో తనదైన శైలిలో బ్యాటు ఝులిపించిన కోహ్లి ఎదురైన బౌలర్‌నల్లా బాదుతూ లక్ష్యాన్ని అంతకంతకు కరిగించుకుంటూ పోయాడు. మరో ఎండ్‌లో ధవన్ కూడా ఫామ్‌లోకి వచ్చే ప్రయత్నం చేశాడు. ఇన్నింగ్స్ జోరందుకున్న తరుణంలో శంసీ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన ధవన్.. బౌండరీ వద్ద మిల్లర్ సూపర్ క్యాచ్‌తో నిష్క్రమించాడు. దీంతో రెండో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఫామ్‌లేమితో సతమతమవుతున్న పంత్(4) మరోమారు నిరాశపరిచాడు. బౌండరీతో టీ20 కెరీర్‌లో 22వ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి చూడచక్కని షాట్లతో అలరించాడు. రబాడ 18వ ఓవర్లో కొట్టిన సిక్స్ మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. మరోవైపు తానేం తక్కువ కాదన్నట్లు అయ్యర్ బౌండరీతో మ్యాచ్‌ను ముగించాడు.

డికాక్, బవుమా విజృంభణ:

డికాక్ మరోమారు తన ప్రతాపం చూపించాడు. ఫోర్‌తో పరుగుల ఖాతా తెరిచిన డికాక్..తన ఉద్దేశమేంటో చెప్పకనే చెప్పాడు. హెండ్రిక్స్(6)ను దీపక్ చాహర్ ఔట్ చేసి వికెట్ల ఖాతా తెరిచాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి దక్షిణాఫ్రికా వికెట్ నష్టానికి 39 పరుగులు చేసింది. డికాక్‌కు బవుమా జతకలిసిన తర్వాత స్కోరుబోర్డు ఊపందుకుంది. బవుమా..హార్దిక్‌ను లక్ష్యంగా చేసుకుంటూ చెలరేగడంతో 10 ఓవర్లు ముగిసే సరికి సఫారీ స్కోరు 78కి చేరింది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని సైనీ విడగొట్టాడు. డికాక్..కోహ్లి సూపర్ క్యాచ్‌తో ఔటయ్యాడు. డస్సెన్(1) జడేజాకు వికెట్ ఇచ్చుకోవడంతో జట్టు కష్టాల్లో పడింది. ఆఖరి నాలుగు ఓవర్లలో దక్షిణాఫ్రికా 24 పరుగులకే పరిమితమైంది.

# స్వచ్ఛత విద్యార్థి దశనుంచే అలవడాలి

## -క్లీన్ కమ్యునిటీస్ ఛాంపియన్ షిప్ కార్యక్రమంలో మేయర్




కూకట్‌పల్లి జెన్‌టియూలో స్వచ్ఛ కార్యక్రమంపై జరిగిన కార్యక్రమంలో సైకిళ్లను పంపిణీ చేసిన మేయర్ బొంతు రామ్మోహన్

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్‌ఎన్ఎ): విద్యార్థి దశ నుండే స్వచ్ఛతను పాటించడం, స్వచ్ఛ కార్యక్రమాల పై అవగాహన పొందేందుకు ఉద్దేశించిన స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని నగర మేయర్ బొంతు రామ్మోహన్, విద్యాశాఖ కార్యదర్శి డా.బి.జనార్ధన్ రెడ్డిలు నేడు ప్రారంభించారు. కూకట్ పల్లి జె.ఎన్.టి.యు ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛ పాఠశాలతో పాటు క్లీన్ కమ్యునిటీస్ ఛాంపియన్ షిప్ కార్యక్రమాన్ని రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి, జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్లు హరిచందన, మమతలతో కలిసి ప్రారంభించారు. పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛ స్ఫూర్తిని కలిగించేలా క్లీన్ కమ్యునిటి చాంపియన్ షిప్, ఇంటర్ స్కూల్ రీసైక్లింగ్ ఛాంపియన్ షిప్ అవార్డులను ఈ కార్యక్రమంలో ప్రధానం చేశారు. 2,145 కిలోల డ్రై, రీసైక్లింగ్ చేసేందుకు వీలుగా ఉన్న వ్యర్థాలను సేకరించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషిచేసిన గచ్చిబౌలి ఓక్రిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ కు చెందిన రెండో తరగతి విద్యార్థి కందునూరి ఆదిత్ కు 2019 అంతర్ పాఠశాలల రీసైక్లింగ్ ఛాంపియన్ షిప్ అవార్డును మేయర్ రామ్మోహన్, విద్యాశాఖ కార్యదర్శి డా.బి.జనార్ధన్ రెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే స్వచ్ఛ కార్యక్రమాలపై పూర్తిస్థాయి అవగాహన, స్ఫూర్తిని కలిగించడం వల్ల ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని అన్నారు.

ఈ దిశలో విద్యాశాఖ, జిహెచ్‌ఎంసితో కలిసి పనిచేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛతకు ప్రతి విద్యార్థి స్వయంగా అంబాసిడర్, (రాయబారి)గా మారి తమ పాఠశాలతో పాటు ఇంట్లోనూ, పరిసరాలలో స్వచ్ఛ కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలో కోటి జనాభా ఉండగా కేవలం 18వేల మంది మాత్రమే నగర పరిశుభ్రతను చేపడుతున్నారని, వీరికితోడు నగరవాసులు స్వచ్ఛందంగా తమ నివాసాలు, పరిసరాలలో పరిశుభ్రతను పాటించాలని కోరారు. ప్రతి ఇంటిలో దోమల ఉత్పత్తికి కారణమయ్యే నీటి నిల్వలను తొలగించాలని అన్నారు. స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం ద్వారా పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచడం, వ్యర్థాలను తడి, పొడి చెత్తగా వేరుచేయడం, సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలు విద్యార్థులకు అలవడుతాయని మేయర్ రామ్మోహన్ పేర్కొన్నారు. విద్యాశాఖ కార్యదర్శి డా.బి.జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 29వేల ప్రభుత్వ పాఠశాలలు, 10వేలకు పైగా ప్రైవేట్ పాఠశాలల్లో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో దాదాపు 80లక్షల మంది విద్యార్థినీవిద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వీరందరిలో స్వచ్ఛత స్ఫూర్తిని కలిగించడానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రపంచంలో దాదాపు 50 దేశాల్లో పాఠశాల స్థాయి విద్యార్థులకు డయేరియా, వైరల్ జ్వరాలు, నిమోనియా ఇతర సీజనల్ వ్యాధులు రావని, దీనికి ప్రధాన కారణం వ్యక్తిగత పరిశుభ్రత పై పాఠశాల స్థాయి నుండే చైతన్యం కలిగించడమని అన్నారు. గాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2వ తేదీన ప్రారంభించే ఈ స్వచ్ఛ పాఠశాల ద్వారా ప్రతి పాఠశాలకు 39 అంశాలను పంపించామని, వీటి ఆదారంగా ప్రతి పాఠశాల స్వీయ మూల్యాంకనం ద్వారా స్వచ్ఛతపై రేటింగ్ పొందాల్సి ఉంటుందని వివరించారు. వచ్చే సంవత్సరం అక్టోబర్ 2నాటికి ఈ 39 అంశాల ప్రాతిపదికపై స్వచ్ఛ పాఠశాలకు సంబంధించి 5స్టార్ రేటింగ్ జారీచేసి తగు ప్రోత్సాహకాలను అందించనున్నట్టు డా. జనార్ధన్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థిపై సంవత్సరానికి రూ.50 వేలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థిపై లక్ష రూపాయలకు పైగా ప్రభుత్వం వెచ్చిస్తోందని, అయితే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిరోజు దాదాపు 20శాతంకు పైగా విద్యార్థులు గైర్హాజరవుతున్నారని వివరించారు. పాఠశాలల్లో హాజరు శాతాన్ని పెంచడం, స్వచ్ఛతపై విద్యార్థులను స్వచ్ఛదూతలుగా రూపొందించే ప్రధాన కార్యక్రమాన్ని చేపట్టామని విద్యాశాఖ కార్యదర్శి తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ ను ప్రారంభించనున్నామని తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ సంచాలకుల కార్యాలయంలో ఈ-ఆఫీస్ ద్వారా దాదాపు రెండున్నర లక్షల్గ ÷ళ్లైను నిర్వహిస్తున్నామని, తద్వారా రెండున్నర లక్షల్గ ÷ళ్లైకు సంబంధించిన పేపర్లను ఆధా చేశామని తెలిపారు.

రాష్ట్రంలో ఉన్న 14.50లక్షల మంది ఆస్తిపన్ను చెల్లింపుదారులకు కూడా ఆస్తిపన్ను డిమాండ్ నోటీసులను ఎలక్ట్రానిక్ విధానం ద్వారానే పంపాలని నిర్ణయించినట్టు తెలిపారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హరిచందన మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ స్ఫూర్తిని కలిగించేవిధంగా పాఠశాలల్లో రీసైక్లింగ్, వ్యర్థాల నిర్వహణ పై చైతన్య కలిగించేలా స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంతో సత్ఫలితాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జోనల్ కమిషనర్ వి.మమత, జె.ఎన్.టి.యు రిజిస్ట్రార్ యాదయ్య, జిహెచ్‌ఎంసి డిప్యూటి కమిషనర్లు రవికుమార్, ప్రదీప్ కుమార్, వావ్ ఐ.టి.సి కి చెందిన సంజయ్ సింగ్, ఉమకాంత్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూతో చిన్నారి మృతి

మహబూబాబాద్, సెప్టెంబర్19 (ఆర్‌ఎన్ఎ): డెంగ్యూ మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా డెంగ్యూ కారణంగా ఓ చిన్నారి మృతి చెందడం అతని కుటుంబాన్ని కలచివేసింది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట మంగలితండాలో డెంగ్యూతో అశ్వంత్ (8) అనే చిన్నారి మృతి చెందాడు.




సూర్యాపేటలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి.

# పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి

## పేదల పెళ్లిళ్ల భారం తప్పించేందుకే కళ్యాణలక్ష్మి

## విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

సూర్యపేట,సెప్టెంబర్19 (ఆర్‌ఎన్ఎ: పేద ప్రజలు తమ కూతుర్ల పెళ్లిల్ల కొరకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారిని ఆదుకోవాలనీ, ఆర్థికంగా వారిపై భారం తగ్గించాలని ప్రవేశపెట్టిన పథకం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ అందిజేస్తోందని విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. ఆడబిడ్డల పెళ్లిళ్లకు సకాలంలో డబ్బులు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఈ పథకంలో భాగంగా వారికి 1,00,116 రూపాయల చెక్కులను రాష్ట్రప్రభుత్వం అందిస్తుందని విద్యుత్ శాఖా మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సూర్యాపేటలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అనీ, పేద బిడ్డల పెళ్లిల్ల కోసం తల్లిదండ్రులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గమనించిన సీఎం ప్రభుత్వం తరఫున వారిని ఆదుకోవాలని ఈ పథకం ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ అమోయ్ కుమార్, జెడ్పీ వైస్ చైర్మెన్ జి. వెంకట నారాయణ గౌడ్, ఆర్డీవో రామ్మోహన్ రావు, సూర్యపేట గ్రంథాలయ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ బి. రవీందర్ రెడ్డి, జెడ్పీటీసీ మెంబర్ జీ డీ భిక్షం సంజీవ్ నాయక్, లబ్దిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

# సరిహద్దులపై సమగ్ర పుస్తకం: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 (ఆర్‌ఎన్ఎ): దేశ సరిహద్దుల గురించి పుస్తకాన్ని రచించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. సరిహద్దుల చరిత్ర గురించి పుస్తకం రాసేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదం వ్యక్తం చేశారు. రానున్న రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. సరిహద్దుల పక్రియ, మేకింగ్, బోర్డర్ల మార్పు, భద్రత, సామాజిక, సాంస్కృతిక అంశాల గురించి ఆ పుస్తకంలో రాయనున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్, నెహ్రూ మెమోరియల్ మ్యూజియం అండ్ లైబ్రరీ, డైరక్టరేట్ జనరల్ ఆఫ్ ఆర్కైవ్స్, కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖ, రక్షణశాఖ అధికారులు ఈ పుస్తకంపై పనిచేయనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపారు.

# బడ్జెట్ సమావేశాలు 14 రోజుల కంటే తక్కువ ఉండరాదు

## అలావుంటే బడ్జెట్‌కు గుర్తింపు ఉండదు

## మీడియాతో ఎంపి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్‌ఎన్ఎ): రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు 14 రోజుల కంటే తక్కువ జరిగితే.. ఆ బడ్జెట్ చెల్లబోదని, ఈ మేరకు అసెంబ్లీ రూల్స్ బుక్‌లోనే నిబంధన ఉందని కాంగ్రెస్ నాయకుడు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో రెండు పార్టీలు ఒప్పుకున్నా సరిపోదు .. ఇలా తక్కువ రోజులు బ్జడెట్ సమావేశాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమేనని పేర్కొన్నారు. తెలంగాణ ప్రస్తుత బడ్జెట్ సమావేశాలు పదిరోజుల్లో ముగుస్తుండటమంటే.. పెళ్లి లేకుండా సహజీవనం చేసినట్లేనని పేర్కొన్నారు. ఈ విషయమై ఎవరైనా కోర్టులో పిటిషన్ వేస్తే.. కోర్ట్ బ్జడెట్‌ను కొట్టేయడం ఖాయమని చెప్పుకొచ్చారు. బుధవారం అసెంబ్లీ లాబీలో రేవంత్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ అంశంపై సభలో చర్చ జరిగినప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో లేకపోవడం సరికాదని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రంలో బర్నింగ్ టాపిక్ అయిన విద్యుత్ అంశాన్ని తమ పార్టీ ఎమ్మెల్యేలు ఎందుకు పట్టించుకోలేదో అడిగేందుకు అసెంబ్లీకి వచ్చానని తెలిపారు. విద్యుత్‌పై ప్రభుత్వం ఏకపాత్రాభినయం చేస్తుంటే.. కాంగ్రెస్ సభ్యులు సభలో లేకపోవడం సరికాదని, దీనిద్వారా పార్టీ ఏం సందేశం ఇచ్చినట్లు అని ఆయన ప్రశ్నించారు. గవర్నర్‌ను కలిసేందుకు తమ పార్టీ సభ్యులు వెళ్లినప్పుడు.. తనకు కూడా సమాచారం ఇవ్వలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో ఎప్పుడు పదవి వస్తుందో.. ఎప్పుడు పదవి పోతుందో ఎవరికి తెలుసునని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నిక టికెట్ ఇంకా అధిష్టానం ఎవరికి కేటాయించలేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి తన సతీమణి పద్మావతికి హుజూర్ నగర్ టికెట్ ఖరారైనట్టు చెప్తున్న వాదనను ఆయన తోసిపుచ్చారు. ఈ ఉపఎన్నికల్లో పోటీకి శ్యామల కిరణ్‌రెడ్డి పేరును తాను ప్రతిపాదిస్తున్నానని, అతను లోకల్ నాయకుడని తెలిపారు. నల్లమలలో యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నేతృత్వంలో పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు, ఆయన నియమించిన యురేనియం వ్యతిరేక కమిటీ చైర్మన్ వీహెచ్ చెప్పారని, ఈ నేపథ్యంలో తాను వాళ్ళ వెంట వెళ్ళడంలో తప్పేమ ందని ప్రశ్నించారు. యురేనియంపై సంపత్ కుమార్‌కు ఏబీసీడీలు కూడా తెలియవని ఎద్దేవా చేశారు. పవన్‌తో మీటింగ్‌కు తాను ఎందుకు వెళ్లానని అడిగేవాళ్ళు .. వాళ్లే ఎందుకొచ్చినట్టు సమాధానం చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్ సంపత్ కుమార్‌తో సెల్ఫీ దిగేందుకు అవకాశం ఇవ్వలేదని, ఆ కోపాన్ని తనపై చూపిస్తే ఏం లాభమని ప్రశ్ని ంచారు. ఏఐసీసీ కార్యదర్శులుగా ఉండి .. మహారాష్ట్రలో ఎన్నికలు వదిలిపెట్టి .. సంపత్, వంశీచంద్‌రెడ్డిలకు ఈ మీటింగ్‌లో ఏం పని అని ప్రశ్నించారు. యురేనియం అంశంపై తాను స్థానికంగా టీడీపీలో ఉండగానే పోరాటం ప్రారంభించానని చెప్పారు. ఇప్పుడు ఆ పోరాటంలో కలిసి వచ్చేవాళ్ళు వస్తారు, రానివాళ్ళు రారని పేర్కొన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కేంద్ర మంత్రులు చెబుతున్నారని, మరి ఆ అవినీతిపై విచారణ జరపకుంటే.. వారికి కూడా భాగస్వామ్యం ఉన్నట్లే కదా అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై తన వద్ద ఉన్న ఆధారాలను త్వరలోనే బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు అందజేస్తానని చెప్పారు.

సినిమా..

# రైతుగా కనిపించనున్న వివి వినాయక్



కమర్షియల్ చిత్రాలని తెరకెక్కించే మాస్ డైరెక్టర్ వినాయక్ త్వరలో హీరోగా ఎంట్రీ ఇస్తున్నసంగతి తెలిసిందే. శరభ ఫేం నరసింహారావు డైరెక్షన్‌లో హీరోగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధం కాగా, ఈ చిత్రాన్ని దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 9న సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు టాక్. అక్టోబర్ 9 వినాయక్ బర్త్‌డే కావడంతో ఆ రోజే చిత్ర షూటింగ్ ప్రారంభించాలని మేకర్స్ అనుకుంటున్నారట. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కనున్న ఈ సినిమా కథ 1940ల కాలం నాటికి సంబంధించినదిగా ఉంటుందని తెలుస్తుంది. చిత్రంలో రైతుగా వినాయక్ అలరించనున్నాడని తాజా సమాచారం. గత కొద్ది రోజులుగా వినాయక్ జిమ్‌లో వర్కవుట్స్ చేస్తూ స్లిమ్‌గా మారారు. హీరోగా ఆయన ఎలా అలరిస్తాడా చూడాలని అభిమానలు ఉవ్విళ్లూరుతున్నారు. వివి వినాయక్ ఇప్పటికే ఠాగూర్, ఖైదీ నంబర్ 150, నేనింతే చిత్రాల్లో గెస్ట్ రోల్స్‌లో కనిపించిన విషయం తెలిసిందే.

వినాయక్ చిత్రంలో హీరోయిన్ గా ప్రముఖ నటి శ్రియ నటిస్తుందని సమాచారం . దీనిని చిత్ర యూనిట్ అధికారకంగా ప్రకటించాల్సి ఉంది . గతంలో వినాయక్ దర్శకత్వంలో శ్రియ చెన్నకేశవరెడ్డి ,ఠాగూర్ సినిమాల్లో నటించింది. 2018లో వచ్చిన ఇంటిలిజెంట్ సినిమాకు వినాయక్ చివరగా దర్శకత్వం వహించారు. సాయి ధరమ్‌తేజ్ హీరోగా నటించిన ఈ సినిమా బాక్సాఫీసు వద్ద డిజాస్టర్ అయ్యింది.

## నాగశౌర్యని డైరెక్ట్ చేయనున్న డెబ్యూ డైరెక్టర్

ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకి దగ్గరైన కుర్ర హీరో నాగశౌర్య. ఇటీవల ఓ బేబి చిత్రంతో ప్రేక్షకులని పలకరించాడు. ఈ చిత్రం మంచి విజయం సాధించినప్పటికీ, ఫుల్ క్రెడిట్స్ సమంతకే దక్కాయి. తాజాగా నాగశౌర్య ప్రాజెక్ట్ సంబంధించి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై నాగ శౌర్య హీరోగా ప్రాజెక్ట్ తెరకెక్కనుంది. ఈ చిత్రాన్నిడెబ్యూ డైరెక్టర్ లక్ష్మి సౌజన్య తెరకెక్కించనున్నారు. అక్టోబర్ నుండి సెట్స్ పైకి వెళ్ళనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మేలో విడుదల కానుంది. చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులకి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడించనున్నారు

## ప్రియుడి బర్త్‌డే వేడుకలో స్పెషల్ ఎట్రాక్షన్‌గా నయనతార

లేడి సూపర్ స్టార్ నయనతార, స్టార్ దర్శకుడు విఘ్నేష్ శివన్ కొన్నాళ్లుగా ప్రేమలో మునిగి తేలుతున్న సంగతి తెలిసిందే. అతి త్వరలో వారిద్దరి వివాహం జరగనుందని అనేక వార్తలు వస్తున్నప్పటికి, వీరిద్దరిలో ఏ ఒక్కరు స్పందించడం లేదు. అయితే బుధవారం విఘ్నేష్ శివన్ బర్త్‌డే కావడంతో ఆయన పుట్టిన రోజు వేడుకని ఘనంగా జరిపింది నయనతార. పలువురు సెలబ్రిటీలు బర్త్‌డే వేడుకకి హాజరు కాగా, వారందరిలో నయనతార స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. బుధవారం విఘ్నేష్ 34వ జన్మదినోత్సవ వేడుకలు జరుపుకున్నాడు.

# సెట్‌లో స్టార్ కమెడీయన్ బర్త్‌డే జరిపిన 'వీ' టీం



ఒకప్పుడు బ్రహ్మానందం, అలీ, సునీల్, ఎంఎస్ నారాయణ వంటి స్టార్ కమెడీయన్స్ తమ కామెడీతో ప్రేక్షకులని కడుపుబ్బ నవ్వించేవారు. ఈ జనరేషన్‌లో దర్శకులకి కనిపిస్తున్న ఏకైక ఆప్షన్ వెన్నెల కిషోర్ అని చెప్పవచ్చు. వెన్నెల కిషోర్ కోసం సపరేట్ కామెడీ ట్రాక్ రెడీ చేస్తున్నారు నేటి దర్శకులు. స్టార్ హీరోల సినిమాలలోను వెన్నెల కిషోర్ నవ్వుల జల్లు కురిపిస్తున్నాడు. 1980 సెప్టెంబర్ 19న జన్మించిన ఆయన నేడు 39వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా వీ చిత్ర బృందం ఆయనతో కేక్ కట్ చేయించి బర్త్‌డే సెలబ్రేషన్ జరిపారు. వీ చిత్రం ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతుండగా, ఇందులో నాని, సుధీర్ బాబు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. థాయ్ ల్యాండ్‌లో చిత్ర షూటింగ్ జరుగుతున్నట్టు తెలుస్తుంది. వెన్నెల కిషోర్ ఈ చిత్రంలోను తన కామెడీతో కడుపుబ్బ నవ్వించున్నాడట. 2005లో విడుదలైన వెన్నెల చిత్రంతో వెండితెరకు పరిచయమైన వెన్నెల కిషోర్ దశాబ్దానికి పైగా అనేక చిత్రాలలో నటించి, తన హాస్యంతో ఆ చిత్ర విజయాలలో కీలకపాత్ర వహించారు.

# అద్దెదారుల వివరాలు ఉచితంగా అందజేస్తాం

### కరీంనగర్ పోలీస్ కమీషనర్ వివి కమలాసన్‌రెడ్డి



కరీంనగర్, సెప్టెంబర్ 19(నేటినిజం ప్రతి నిధి):అద్దెదారులను వివరాలను ఉచితంగా అందజేస్తామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. వివరాలను తెలుసుకోకుండా అపరిచితులకు ఇళ్ళను అద్దెకివ్వద్దని చెప్పారు. గురువారం నాడు కరీంనగర్‌లోని కట్టరాంపూర్ ప్రాంతంలో వినాయక్‌నగర్, శ్రీనివాసనగర్, శ్రీనగర్‌కాలని, మహాలక్ష్మినగర్,ప్రొఫేసర్ జయశంకర్‌కాలనీల్లో పోలీసులు కార్డన్‌అండ్‌సెర్చ్ నిర్వహించారు. ఉదయం 05గంటల నుండి 7:30గంటల వరకు ప్రతి అనుమానిత ప్రాంతంలో సోదాలను నిర్వహించారు. అనంతరం కాలనీవాసులతో ఏర్పాటైన కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ అద్దెదారుల వివరాలు తెలుసుకోకుండా ఇళ్ళను అద్దెకిచ్చినట్లయితే అసాంఘీకశక్తులు ఆశ్రయం పొందే ప్రమాదముందన్నారు. చొప్పదండిలో బ్యాంక్ దోపిడికి పాల్పడిన అసాంఘీకశక్తులు కరీంనగర్‌లో ఆశ్రయం పొంది దోపిడీకి పాల్పడ్డారని చెప్పారు. అద్దెదారుల వివరాలతో సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ధరఖాస్తు అందజేసినట్లయితే నిమిషాల వ్యవధిలో వివరాలను అందజేస్తారని పేర్కొన్నారు. నేరాల ఛేదన,నియంత్రణ కోసం దోహదపడే సిసి కెమెరాల ఏర్పాటులో భాగస్వాములయ్యేందుకు అన్నివర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఒక్కో సిసికెమెరా 30మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. ఇళ్ళకు నాణ్యమైన తాళాలను వేసుకోవాలని తెలిపారు. అలారమ్ శబ్దం వచ్చే తాళాలు వినియోగించాలని సూచించారు. ప్రజలు నేరుగా వెళ్ళి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా పోలీస్‌శాఖ అన్నివర్గాల ప్రజల సౌకర్యార్ధం హాక్‌ఐ యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చిందని తెలిపారు. స్మార్ట్‌ఫోన్ కలిగిఉన్న ప్రతిపౌరుడు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్‌లో మహిళల భద్రత కోసం ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ప్రజల భద్రత,రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. క్షణాల వ్యవధిలో అనుమానితులను నిర్ధారించే ఫోర్టబుల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్‌ను ఈ సందర్భంగా ప్రదర్శించారు. పైన పేర్కొన్న కాలనీవాసులు స్వచ్ఛందంగా సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు.

ఈ సందర్భంగా సరైన ధృవపత్రాలులేని 52ద్విచక్ర వాహనాలు, రెండువేల రూపాయల విలువచేసే గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎసిపిలు అశోక్, శివభాస్కర్, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, దేవారెడ్డి, దామోదరరెడ్డి, శ్రీనివాస్, ఆర్‌ఐ జానీమియాలతోపాటు వివిధ విభాగాలకు చెందిన 200మంది పోలీసులు పాల్గొన్నారు.

# మియావాకి పద్ధతిలో అడవుల పెంపకానికి పోలీసుల కృషి

### –కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, సెప్టెంబర్ 19(నేటినిజం ప్రతి నిధి):మియావాకి పద్ధతిలో అడవుల పెంకకానికి కృషిచేస్తామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. తక్కువ భూభాగంలో ఎక్కువ మొక్కల పెంపకానికి మియావాకి పద్ధతి దోహదపడుతుందని చెప్పారు.

గురువారం నాడు మియావాకి పద్ధతిలో చిట్టడవుల పెంపకంలో భాగంగా కరీంనగర్‌లోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పోలీస్ కమీషనర్ విబి కమలాసన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడుతూ అడవులు అంతరించిపోవడం వల్లనే వర్షాభావం పరిస్థితులేర్పడ్డాయన్నారు. ఈ దుస్థితి కొనసాగితే భవిష్యత్‌లో వినాశనం, విధ్వంసం తప్ప ఏమీఉండదని పేర్కొన్నారు. మొక్కల పెంపకం లేనట్లయితే భవిష్యత్‌లో తలెత్తే విపత్కర పరిస్థితులను వివరిస్తూ దివంగత రాష్ట్రపతి అబ్దుల్‌కలాం పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను చూడాలని చెప్పారు.

జపాన్‌కు చెందిన వృక్షశాస్త్రవేత్త మియావాకి తక్కువ భూభాగంలో ఎక్కువ మొక్కలు నాటే పద్ధతిని కనుగొన్నారన్నారు. ఈ సద్ధతి ప్రకారం 300గజాల విస్తీర్ణంలో చిన్నపాటి అడవులను తయారు చేయవచ్చని తెలిపారు. సిటి పోలీస్ శిక్షణ కేంద్రం (సిపిటిసి)లో ఒక ఎకరం విస్తీర్ణంలో 12వేల మొక్కలను నాటే పనులను మొదలుపెట్టామని చెప్పారు. జీవకోటికి ప్రాణాధారం అయిన మొక్కలు నాటడంలో అన్నివర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

మున్సిపల్ కమీషనర్ వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాభావ పరిస్థితులకు కారణం మొక్కల పెంపకం లేకపోవడమేనన్నారు. 33శాతం అడవుల పెంపకం అవసరమని చెప్పారు. కరీంనగర్‌లో కేవలం 06శాతం మాత్రమే మొక్కల పెంకపంఉందని తెలిపారు. అన్నివర్గాల ప్రజలు మొక్కలు నాటేందుకు స్వచ్ఛందంగా ముందుకురావాలని పిలుపునిచ్చారు.

చిట్టడవుల పెంకకంలో భాగంగా టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఒకవెయ్యి మొక్కలను నాటారు. శాంతి,సంక్షేమకమిటి సభ్యులు, వాగేశ్వరి, వాణినికేతన్ కళాశాలలకు చెందిన విద్యార్థుల సహకారంతో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(ఎల్‌అండ్‌ఓ) ఎస్ శ్రీనివాస్, ఎసిపి పి అశోక్, ఇన్స్‌పెక్టర్ దేవారెడ్డి, డిప్యూటి ఫారెస్ట్‌రేంజ్ అధికారిణి జి పద్మ, బీట్ ఆఫీసర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌పై కాంగ్రెస్‌లో పంచాయితీ

### పద్మావతి పేరును ఎలా ప్రకటిస్తారన్న రేవంత్

హైదరాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ అభ్యర్థిగా పద్మావతి పేరును ఏకపక్షంగా ప్రకటించడం పట్ల ఎంపీ, కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జీ కుంతియాను కలిసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి షోకాజు నోటీసు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధిష్టానానికి సమాచారం లేకుండా ఉత్తమ్‌కుమార్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కుంతియాతో రేవంత్ ఫిర్యాదు చేశారు. అభ్యర్థిని ప్రకటించడం పూర్తి తప్పిదమని వివరించారు. కాగా, ఈ విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని కుంతియా హామీ ఇచ్చారు. యురేనియంపై కాంగ్రెస్ నేత సంపత్‌కు ఏబీసీడీలు తెలియవని ఎంపీ రేవంత్ రెడ్డి అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ సెల్ఫీ దిగేందుకు సంపత్‌కు అవకాశం ఇవ్వలేదని.. ఆ కోపం తనపై చూపిస్తే ఏం లాభమని ఆయన ప్రశ్నించారు. బుధవారం రేవంత్ అసెంబ్లీ లాబీలో మీడియాతో మాట్లాడుతూ హుజూర్‌నగర్ ఉపఎన్నిక అభ్యర్థిగా. .అధిష్టానం ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదన్నారు. తాను చామల కిరణ్‌రెడ్డిని ప్రతిపాదిస్తున్నానని రేవంత్ తెలిపారు. తెలంగాణ గవర్నర్ తమిళసై సౌందరరాజన్‌ను కలిసేందుకు వెళ్లిన కాంగ్రెస్ నేతలు తనకు సమాచారం ఇవ్వలేదని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతిపై.. తన దగ్గర ఉన్న ఆధారాలను త్వరలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌కు అందజేస్తానన్నారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కేంద్ర మంత్రులు చెప్తున్నారని.. అవినీతిపై విచారణ జరపకుంటే వారికీ భాగస్వామ్యం ఉన్నట్లేనని రేవంత్ అన్నారు.

# గృహనిర్బంధం కింద నేతలకు త్వరలోనే విముక్తి

### –కశ్మీర్ మాజీ సిఎంల అరెస్ట్‌పై కేంద్రమంత్రి వ్యాఖ్య

న్యూఢిల్లీ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): జమ్మూ–కశ్మీరులో గృహ నిర్బంధంలో ఉన్న నేతలు త్వరలోనే విడుదలవుతారని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు. ఆ రాష్ట్రానికి వర్తించే అధికరణ 370ని రద్దు చేయడంతోపాటు రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించడానికి ముందు రోజు నుంచి కొందరు ముఖ్య నేతలను గృహ నిర్బంధంలో ఉంచిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ హయాంలో 1975 నుంచి 1977 మధ్య కాలంలో విధించిన అత్యవసర పరిస్థితి 18 నెలలపాటు కొనసాగింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ దీనిని పరోక్షంగా ప్రస్తావిస్తూ, ఆగస్టు 4 నుంచి గృహ నిర్బంధంలో ఉన్న జమ్మూ–కశ్మీరు నేతలు 18 నెలల కన్నా తక్కువ కాలంలోనే విడుదలవుతారని చెప్పారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రతిసారీ తాను ఇదే గడువును చెప్తున్నానన్నారు. సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత జమ్మూ–కశ్మీరుకు రాష్ట్ర హోదా కల్పిస్తామన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్, పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీలపై విరుచుకుపడుతూ వంశపారంపర్య పాలనను కొనసాగించుకునేందుకు అధికరణ 370, అధికరణ 35ఏ వంటివాటిని ఉపయోగించుకున్నారని దుయ్యబట్టారు. అమాయక కశ్మీరీలను 70 ఏళ్ళపాటు అంధకారంలో ఉంచారన్నారు. అధికరణ 370ని రద్దు చేయడంతో శ్యామా ప్రసాద్ ముఖర్జీ కలలు సాకారమయ్యాయని జితేంద్ర తెలిపారు. యావత్తు దేశానికి ఒకే జెండా, ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాన మంత్రి ఉండాలని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోరాడిన సంగతి తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో జాతి వ్యతిరేక, వేర్పాటువాద కార్యకలాపాలకు స్థానం లేదని జితేంద్ర చెప్పారు. జమ్మూ–కశ్మీరు మాజీ ముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దుల్లా, ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తీ ప్రస్తుతం గృహ నిర్బంధంలో ఉన్న సంగతి తెలిసిందే. .÷–రజా భద్రత చట్టం క్రింద ఫరూఖ్ అబ్దుల్లాను నిర్బంధించారు. రెండేళ్ళ వరకు విచారణ లేకుండా ఏ వ్యక్తినైనా నిర్బంధించవచ్చునని ఈ చట్టం చెప్తోంది.

# ప్రధానితో ముగిసిని మమత భేటీ

### బెంగాల్ పేరును బంగ్లాగా మార్చాలని వినతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని బెంగాల్‌కు ఆహ్వానించినట్టు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తెలిపారు. ప్రధానితో బుధవారం సమావేశమైన మమతా బెనర్జీ ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రధానిని మర్యాదపూర్వకంగానే తాను కలుసుకున్నానని, తమ సమావేశం ఫలప్రదమైందని చెప్పారు. బెంగాల్‌లో జరుగనున్న వాణిజ్య సదస్సుకు రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించానని, అలాగే బెంగాల్ పేరును 'బంగ్లా'గా మార్చే విషయంపై కూడా ఆయనతో మాట్లాడానని చెప్పారు. దీనిపై తాను చేయగలిగినదంతా చేస్తానని మోదీ హామీ ఇచ్చారని చెప్పారు. దీనితోపాటు, ప్రపంచంలోనే రెండవ అతిపెద్దదైన బొగ్గు గని డియోచా పచామి ప్రాజెక్టు కార్యక్రమంలో కూడా పాల్గొనాలని ప్రధానిని కోరామని చెప్పారు. ప్రాజెక్టు విలువ రూ.12,000 కోట్లని ఆమె చెప్పారు. కేంద్రంతో కలిసి పనిచేసేందుకు సముఖంగా ఉన్నామని ఆమె తెలిపారు. పలు అంశాలు కూడా తమ మధ్య చర్చకు వచ్చాయని, సుహృద్భావ వాతావరణంలో తమ సమావేశం జరిగిందని తెలిపారు. ఎన్‌ఆర్‌సీపై మీడియా అడిగినప్పుడు ఆ అంశం తమ సమావేశంలో ప్రస్తావనకు రాలేదని మమత జవాబిచ్చారు.

# వాళ్లు పాక్ ఉగ్రవాదులే!

### తేల్చేసిన యురోపియన్ యూనియన్

న్యూఢిల్లీ,సెప్టెంబర్19 (ఆంఎన్ఎ): కశ్మీర్ అంశాన్ని భారత్, పాకిస్థాన్ దేశాలు నేరుగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాని యురోపియన్ యూనియన్ అభిప్రాయపడింది. కశ్మీర్ సమస్యను శాంతియుత ప్రతిపాదన ద్వారా పరిష్కరించుకోవాలని సూచించింది. బుధవారం జరిగిన ఈయూ సమావేశాల్లో పోలాండ్‌కు చెందిన కన్జర్వేటివ్ నేత రిజార్డ్ కార్నెకి మాట్లాడుతూ.. ప్రపంచంలో భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమన్నారు. భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడుల గురించి ఆలోచించాలన్నారు. ఈ ఉగ్రవాదులు ఆకాశం నుంచి రాలిపడలేదని, వారంతా పొరుగు దేశం నుంచి వస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉగ్రవాద విషయంలో భారత్‌కు మనం మద్దతు ఇవ్వాలన్నారు. ఇక ఇటలీకి చెందిన పుల్వియో మార్టుసెలి అనే క్రిస్టియన్ డెమొక్రాట్ కూడా ఈయూ సభలో మాట్లాడారు. అణ్వాయుధాలు వాడుతామని పాక్ నేరుగా హెచ్చరించిందన్నారు.

# పునరుత్పాదక రంగంలో ముందడుగు

### –న్యూజెర్సీతో తెలంగాణ ఒప్పందం

హైదరాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం పునరుత్పాదక రంగంలో మరో ముందడుగు వేసింది. పునరుత్పాదక రంగంలో అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం అమెరికా న్యూజెర్సీ రాష్ట్రంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో న్యూజెర్సీ రాష్ట్ర గవర్నర్ ఫిల్ మర్ఫీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్ కే జోషి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..ఈ ఒప్పందం ద్వారా రెండు రాష్ట్రాల్లో జియో థర్మల్, థర్మల్ ఎనర్జి స్టోరేజ్ విభాగాల్లో మరింత పురోగతి సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే సోలార్ ద్వారా 20.41 గిగావాట్లు, విండ్ ఎనర్జీ ద్వారా 4.2 గిగావాట్ల శక్తితో కలిపి మొత్తంగా 4 వేల 36 మెగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించిందన్నారు. తెలంగాణలో వాణిజ్య అనుకూల వాతావరణం ఉందని ఈ సందర్భంగా న్యూజెర్సీ గవర్నర్ ఫిలిప్ మర్ఫీ అన్నారు.

# రైల్వే ఉద్యోగులకు దసరా కానుక

### 78 రోజుల బోనస్

న్యూఢిల్లీ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): రైల్వే ఉద్యోగులకు కేంద్రం బోనస్ ప్రకటించింది. ఈ ఏడాది వారికి 78 రోజుల వేతనాన్ని బోనస్‌గా చెల్లించనున్నట్లు కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ తెలిపారు. బుధవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.

క్యాబినెట్ మీటింగ్ తర్వాత ఆయన మాట్లాడుతూ.. సుమారు 11 లక్షల 52వేల మంది రైల్వే ఉద్యోగులకు బోనస్ ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. ఉద్యోగుల్లో ప్రేరణ నింపేందుకు బోనస్‌ను ప్రకటిస్తున్నట్లు రైల్వే శాఖ పేర్కొన్నది. తమ ప్రభుత్వం గత ఆరేళ్ల నుంచి రికార్డు స్థాయిలో రైల్వే ఉద్యోగులకు బోనస్ ఇస్తున్నట్లు మంత్రి జవదేకర్ తెలిపారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.